నవతెలంగాణ
ఆదిలాబాద్
1
శుక్రవారం | జనవరి 19, 2024 | www.navatelangana.com

రైతులకు ఎరువుల కొరత లేకుండా చూస్తాం

నవతెలంగాణ-కుభీర్

మండల రైతులకు రబీ సీజన్‌లో అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచి ఇబ్బందులు రాకుండా చూస్తామని వ్యవసాయ సహకార సంఘం చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ రేకుల గంగాచరణ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలోని 41 గ్రామ పంచాయతీలో మొక్కజొన్న, శనగ పంటలకు అవసరమైన యూరియాను అందుబాటులో ఉంచి ఇబ్బందులు రాకుండా చూస్తామని తెలిపారు. ఇప్పటి వరకు 28వేల యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అవసరమున్న రైతులకు రూ.267కు ఎరువులు అందించేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట న్యూసాంలి సర్పంచ్ గంగాధర్ ఉన్నారు.



కాంగ్రెస్ ఎస్టీ సెల్ చైర్మన్‌గా గోవింద్ నాయక్

నవతెలంగాణ-ఖానాపూర్

కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా చైర్మన్‌గా బానావత్ గోవింద్ నాయక్ నియమితులయ్యారు. గురువారం ఆయనకు నియామక పత్రాన్ని చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్ అందజేశారు. ఈ సందర్భంగా గోవింద్ నాయక్ మాట్లాడుతూ పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు సమయం వెచ్చించి పనిచేస్తానని తెలిపారు. పదవికి సహకరించిన ఎఐసిసి నాయకులు నరేష్ జాదవ్, డిసిసి జిల్లా అధ్యక్షులు శ్రీహరిరావు, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, సేవాదళ్ సీనియర్ నాయకుడు అంబడి రాజేశ్వర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



మహాలక్ష్మి రావాలి..ఇండ్లు కావాలి..!

- పథకాలు పొందేందుకు వెల్లువెత్తిన అర్జీలు
- ఉచిత విద్యుత్..రైతు భరోసాపైనా మక్కువ
- అన్ని పథకాలు అవసరమని అధికంగా ఆకాంక్ష
- ఉమ్మడి జిల్లాలో ఐదు గ్యారెంటీలకు భారీ డిమాండ్
- ప్రభుత్వం అమలు చేయడంపైనే అందరి ఆశలు

ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఐదు గ్యారెంటీలకు భారీ డిమాండ్ నెలకొంది. వీటిని పొందేందుకు ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రజాపాలన పేరిట ప్రభుత్వం వారం రోజులుగా చేపట్టిన సభల్లో అర్జీలు భారీగా వెల్లువెత్తాయి. ఒకే దరఖాస్తుపై ఐదు గ్యారెంటీ పథకాలకు దరఖాస్తులు చేసుకునే సౌలభ్యం కల్పించడంతో మెజార్టీ జనాలు ఒకటి, రెండు మినహా అన్నింటిని తీసుకునేందుకు మొగ్గుచూపుతుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. ముఖ్యంగా తొలుత అమలుకానున్న ఐదు గ్యారెంటీల్లో ఎక్కువ మంది మహాలక్ష్మి పథకం రావాలని..ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని అర్జీలు అందించడం ఆసక్తికరంగా మారింది. వీటితో పాటు రూ.500లకే వంట గ్యాస్ అందిస్తామని ప్రభుత్వం చెప్పడంతో ఈ సౌలభ్యాన్ని వర్తింపజేయాలని భారీగా దరఖాస్తులు అందించారు. వీటితో పాటు రైతులు, కౌలు రైతులు అనేక మంది రైతు భరోసా వర్తించడం కోసం మరోసారి వినతులు అందించడం గమనార్హం. ముఖ్యంగా గృహ అవసరాల కోసం 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించాలని, వ్యవసాయ కూలీలు ఆర్థిక సాయం అందించాలని భారీగా అర్జీలు వెల్లువెత్తాయి. దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ ముగియడంతో వీటి అమలుపైనే అందరిలో ఆతృత నెలకొంది.



ప్రజాపాలనలో దరఖాస్తు అందుకుంటున్న మంత్రి సీతక్క(ఫైల్)

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన అనతికాలంలోనే ఎన్నికల మేనిఫెస్టోను అమలు చేయాలని భావించింది. ఎన్నికల సందర్భంగా హామీలిచ్చిన ఆరు గ్యారెంటీలను అధికారంలోకి వస్తే కచ్చితంగా అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ భరోసా ఇచ్చింది. ఆ పార్టీ పట్ల ప్రజలు విశ్వాసం ఉంచి అధికారం కట్టబెట్టారు. ఇప్పుడు ప్రభుత్వం హామీని నిలబెట్టుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. ప్రభుత్వం కొలువు దీరిన కొద్ది రోజుల్లోనే గత ఏడాది డిసెంబర్ 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు ప్రజాపాలన పేరిట గ్రామాలు, పట్టణాల్లో సభలు నిర్వహించి అర్జీలు స్వీకరించింది. ఈ ప్రక్రియ ముగిసిన మరుసటి రోజు నుంచి ఈ నెల 17వ వరకు దరఖాస్తులను కంప్యూటీకరణ చేసి ప్రభుత్వ వెబ్‌సైట్‌లో పొందుపర్చారు. తాజాగా ఈ క్రతువు ముగిసిపోవడంతో ఏయే పథకాలకు ఎంతమంది దరఖాస్తులు అందించారో ప్రభుత్వం వివరాలు వెల్లడించింది. వీటి ప్రకారం మహాలక్ష్మి పథకంలో భాగంగా ప్రతి మహిళకు నెలకు రూ.2500చొప్పున అందిస్తామని..గ్యాస్ సిలిండర్‌ను రూ.500లకే అందిస్తామని చెప్పడంతో ఈ పథకాలకు అనేక మంది అర్జీలు అందించారు. మరోపక్క ఏండ్లుగా ఇండ్లు లేక నరకయాతన పడుతున్న పేదలు ఇందిరమ్మ ఇండ్లు మంజూరుచేయాలని భారీ ఎత్తున విన్నవించడం ప్రాధాన్యం సంతరించుకుంది. మరోపక్క ప్రతి ఇంటికి 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తామని చెప్పడంతో ఈ సౌకర్యాన్ని పొందేందుకు అనేక మంది అర్జీ రూపంలో అవసరాన్ని వెల్లడించారు.



ప్రజల నుండి దరఖాస్తులు తీసుకుంటున్న సిబ్బంది(ఫైల్)

ఈ పథకాలకూ భారీ డిమాండ్

ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలు అందరికీ ఆమోదయోగ్యంగా ఉండటంతో జనాలు పింఛన్లు మినహా..అన్నింటినీ పొందేందుకు ఆసక్తి కనబర్చారు. ముఖ్యంగా ఇప్పటికే రైతుబంధు వస్తున్న రైతులు సైతం మరోసారి రైతుభరోసా పథకానికి అర్జీలు అందించారు. వీరితో పాటు కౌలు రైతులకు ఈ పథకం వర్తించడంతో కౌలు వ్యవసాయం చేస్తున్న అందరూ దరఖాస్తులు అందించారు. వీరితో పాటు వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12వేల చొప్పున అందిస్తామని ప్రభుత్వం పేర్కొనడంతో అనేక మంది నిరుపేదలు, ఉపాధిహామీ పనులపై ఆధారపడి జీవించే వారు ఈ పథకానికి వినతులు అందించారు. వీటితో పాటు తెలంగాణ ఉద్యమకారులు సైతం వేల సంఖ్యలోనే అర్జీలు అందించడం గమనార్హం. వికలాంగుల పింఛన్లతో పాటు కొత్తగా పింఛన్లు కావాలని వేలాది మంది అర్హులు దరఖాస్తులు అందించడం ఆసక్తికరంగా మారింది.

ఉమ్మడి జిల్లాలో 8,92,507 మంది దరఖాస్తులు చేయగా అధికారులు వాటన్నింటినీ కంప్యూటీకరించారు. ఆదిలాబాద్ జిల్లాలో 230255 దరఖాస్తులు రాగా నిర్మల్‌లో 243688, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 163652, మంచిర్యాల జిల్లాలో 254912 దరఖాస్తులను ఆన్‌లైన్ చేశారు. ప్రభుత్వం వీటిని ఎప్పుడెప్పుడు అమలు చేస్తుందా అని ఆతృతగా ఎదురుచూస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఆయా పథకాల కోసం వచ్చిన వినతుల వివరాలు

పథకం	ఆదిలాబాద్	నిర్మల్	ఆసిఫాబాద్	మంచిర్యాల
మహాలక్ష్మీ	204201	168458	150972	210630
వంట గ్యాస్	181721	197674	129770	213037
రైతుభరోసా	95652	100527	77213	93634
కౌలు రైతులు	6455	5630	6949	10598
వ్య.కూలీలు	111571	122549	90491	106373
ఇండ్లు	199803	193647	154141	210216
250గజాలు	335	349	144	323
ఉద్యమకారులు	1555	1317	713	2532
గృహజ్యోతి	161366	176362	108384	180143
వికలాంగ పింఛన్లు	5285	6670	3405	6591
ఇతర పింఛన్లు	42147	85066	24157	50470
మొత్తం	10,10,091	10,58,249	7,46,339	10,83,482

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నవతెలంగాణ-కుభీర్

మండలంలోని బకోట గ్రామ సమీపంలో బస్సు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..తానూర్ మండలం మస్లగా గ్రామానికి చెందిన నిలేవార్ శివాజీ (32) బకోట గ్రామానికి భార్య రంజనతో కలిసి అత్తగారింటికి వచ్చారు. గురువారం ఉదయం తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో భైంసా నుంచి కుభీర్ వైపుకు వస్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొంది. బస్సు శివాజీ తలపై నుండి పోవడంతో తల నుజ్జునుజ్జు అయి అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఎండి షరీఫ్ తెలిపారు. ఆర్టీసీ బసుస డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు సహకరించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తు రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు సహకరించాలని ఉప రవాణ శాఖ అధికారి డాక్టర్ పుప్పాల శ్రీనివాస్ కోరారు. గురువారం ఆయన తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. జనవరి 15 నుంచి ఫిబ్రవరి 14 వరకు రోడ్డు భద్రత మాసోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సంవత్సరం ట్రాఫిక్ రూల్స్ పాటిద్దాం... ప్రమాదాలను నివారిద్దాం అనే నినాదంతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలను తెలుసుకుంటూ ప్రమాదాలు జరగకుండా ప్రయాణం చేస్తు సురక్షితంగా ఇండ్లకు చేరుకోవాలని కోరారు. ట్రాఫిక్స్ రూల్స్‌పై కార్యాలయంలో సంప్రదిస్తే అవగాహన కల్పిస్తామన్నారు.

అవకాశమిస్తే సేవ చేస్తా

నవతెలంగాణ-ముథోల్

రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థిగా బీజేపీ అవకాశం ఇస్తే ప్రజలకు సేవ చేస్తానని సినీ హీరో, బిజెపి నాయకులు కేతావత్ అభినవ్ సర్దార్ అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌ను గురువారం కలిశారు. ఆయనతో పాటు నియోజకవర్గ బిజెపి నాయకులను కలిసి మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఆదిలాబాద్ జిల్లా అంటే తనకు అభిమానమన్నారు. ఆదిలాబాద్ ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో బీజేపీలో చేరానని తెలిపారు. ఆదిలాబాద్ అభివృద్ధిలో చాలా వెనుకబడిందన్నారు. వనరులున్నా అభివృద్ధి జరగలేదన్నారు. తనకు అవకాశం వస్తే అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

యువత రాజకీయాల్లోకి రావాల్సిన అవసరముంది

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నిస్వార్థ సేవ చేయడానికి యువత రాజకీయాల్లో రావాల్సిన అవసరముందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. గురువారం జైనథ్ మండలం పూసాయి గ్రామానికి చెందిన సంజీవ్, గణేష్, కుమార్ ఆధ్వర్యంలో పలువురు యువకులు ఎమ్మెల్యే సమక్షంలో బీజేపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో తన వెంట ఉండి గెలుపుకు సహకరించిన యువత నేడు ప్రత్యక్షంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వాన్ని బలపరిచేందుకు పార్టీలో చేరడం సంతోషకరణమన్నారు. జనవరి 22న భవ్య రామమందిర ప్రాణ ప్రతిష్ట నేపథ్యంలో ప్రతి ఒక్కరు తమ ఇండ్లలో పూజలు చేయాలన్నారు. పదేండ్ల కాలంలో ప్రధానమంత్రి చేసిన పనులను మారుమూల గ్రామాల ప్రజలు గుర్తిస్తున్నారన్నారు. అదే పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపుకు కారణం అవుతుందన్నారు. రాష్ట్రంలో ఏ ఎన్నికలు వచ్చిన బీజేపీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలన్నారు. పార్టీలో పని చేసిన వారికి గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు లాలామున్న పాల్గొన్నారు.

తుడుందెబ్బ మండల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



నార్నూర్ : మండల కేంద్రంలోని ఆదివాసీ భవనంలో గురువారం తుడుందెబ్బ మండల కమిటీని జిల్లా అధ్యక్షుడు పుర్క బాపురావ్ ఆధ్వర్యంలో డివిజన్ అధ్యక్షుడు కనక ప్రభాకర్ అధ్యక్షతన ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ ఆదివాసుల హక్కుల సాధన లక్ష్యంగా తొమ్మిది తెగల ఆదివాసులు ఉద్యమించాలన్నారు. తుడుందెబ్బ ఏ రాజకీయ పార్టీకి అనుబంధం కాదని, ఆదివాసీ సమాజ జాగృతి కోసమే పనిచేస్తుందని తెలిపారు. తుడుం దెబ్బ మండల గౌరవాధ్యక్షులుగా మడావి మన్కు, అధ్యక్షులుగాలాడ శ్రీరామ్, కార్యనిర్వహణ అధ్యక్షులుగా మడావి సాగర్, ఉపాధ్యక్షులుగా ఆత్రం పరమేశ్వర్, మేస్రం ప్రభాకర్, కుర్సెంగ రాందాస్, మెస్రం హీరాలాల్, ప్రధాన కార్యదర్శిగా పెందూర్ విఠల్, కోశాధికారిగా జుగ్నక్ భీంరావ్, కార్యదర్శులుగా సెడ్మకి భీంరావ్, మడావి జైవంత్‌రావ్ ఎన్నికయ్యారు.

డబుల్ ఓటర్లను గుర్తించి తొలగించాలి

తాండూర్ : ఓటర్ లిస్టులో డబుల్‌గా నమోదైన ఓటర్లను గుర్తించి ఫామ్-7 ద్వారా తొలగించాలని తహసీల్దార్ రోహిత్ తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన బిఎల్‌ఓల సమావేశంలో మాట్లాడారు. సోమవారం లోపు ఓటర్ల నమోదు, తొలగింపు ప్రక్రియ పూర్తి కావాలని సూచించారు. దీనికి బిఎల్‌ఓలు ఇంటింటి సర్వే నిర్వహించాలన్నారు. ఫామ్-7 గురించి పూర్తి వివరాలను ఓటర్లకు, రాజకీయ నాయకులకు తెలియజేయాలని కోరారు. ఓటర్ల తొలగింపుకు వచ్చిన అర్జీలను పరిశీలించి తొలగించాలని తెలిపారు. ముఖ్యంగా స్థానికంగా లేని ఓటర్ల వివరాలను సేకరించి పరిశీలించాలని పేర్కొన్నారు. దూర ప్రాంతాల్లో నివసించే వారు అక్కడ ఓటు హక్కు కలిగి ఉన్నది లేనిది జాగ్రత్తగా పరిశీలించి తొలగించాలని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, ఆర్ఐ మురళీధర్‌రావు, బిఎల్‌ఓలు పాల్గొన్నారు

మైనార్టీ పాఠశాలలో దరఖాస్తుల స్వీకరణ

ఖానాపూర్‌టౌన్ : పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎం.సత్యం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 5వతరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశం కొరకు విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 5వ తరగతిలో 40 సీట్లు ఉండగా ఇందులో ముస్లిం మైనార్టీలకు 26, క్రిష్టియన్ మైనార్టీలకు 2, ఎస్టీ 2, ఎస్సీ 2, బీసీ 5, ఓసీలకు 1 చొప్పున కేటాయించినట్లు పేర్కొన్నారు. ఇంటర్ బైపీసీ, ఎంపీసీలో ఒక్కో గ్రూపునకు 40 సీట్లను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. వీటిలో మైనార్టీలకు 30, ఎస్సీ 2, ఎస్టీ 2, బీసీ 5, ఓసీలకు 1 కేటాయించినట్లు వివరించారు. మైనార్టీ విద్యార్థులకు దరఖాస్తు చేసుకున్న వరుస క్రమసంఖ్య ఆధారంగా సీట్ల కేటాయింపులో ప్రాధాన్యత ఉంటుందని, నాన్ మైనార్టీలకు లక్కీడ్రా ద్వారా సీట్లను భర్తీ చేస్తామని పేర్కొన్నారు. వీటితో పాటు 6,7,8 తరగతుల్లోని బ్యాక్‌లాగ్ సీట్లను కూడా భర్తీ చేయనున్నట్లు తెలిపారు. వివరాలకు గురుకుల పాఠశాల ఫోన్ 9494027314, 7893899886 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి కృషి

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

నవతెలంగాణ-కడెం

నియోజకవర్గంలోని దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం మండలంలోని గంగాపూర్ గ్రామ బ్రిడ్జిని పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్రంలో గడీల ప్రభుత్వం పోయి ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పాటు అయిందన్నారు. ప్రతి పేదవాడిని అన్ని రకాలుగా ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి మాటకు కట్టుబడి ఉండి ఆ దిశగా పనిచేస్తుందని తెలిపారు. ఆరు గ్యారంటీలను ప్రతి గడపకు చేరే విధంగా కృషి చేస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో యువతీ యువకులు ఉన్నత చదువులపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. వారంలోగా అధికారుల నుండి నివేదికలు తీసుకోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పెండింగ్ బిల్లులు త్వరగా విడుదలయ్యే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. అల్లంపల్లి నుండి ప్రత్యేక బస్సు నడిపించడానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అనంతరం పేద కుటుంబాలకు దుప్పట్లు, స్వెటర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆంటోనీ అలెగ్జాండర్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు పడిగల భూషణ్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పొద్దుటూరు సతీష్‌రెడ్డి, మాజీ జెడ్పిటిసి తక్కల్ల సత్యనారాయణ, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బరుపటి రమేష్, అంబారిపేట్ ఎంపీటీసీ కట్ల సింధుజ సాగర్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌పై విచారణ

నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని లింగాపూర్ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌పై జిల్లా విద్యాధికారికి విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేయగా గురువారం సప్దార్ అలీఖాన్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టినట్లు మండల విద్యాధికారి కాసుల రవీందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల హాజరు పట్టికలో సిరా వేయడం, విద్యార్థులకు డ్రెస్సులు ఇప్పిస్తానని చెప్పి ఒక్కో విద్యార్థి నుండి రూ.1500 వసూలు చేయడం, పాఠశాల వార్షికోత్సవానికి ఒక్కో విద్యార్థి నుండి రూ.200 వసూలు చేయడం వంటి ఫిర్యాదులు అందాయన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేపట్టామన్నారు. పాఠశాలలో ఒకప్పటి విద్యార్థుల సంఖ్య కన్నా ఇప్పుడు గణనీయంగా తగ్గిందని, దీనికి ప్రిన్సిపాల్ నిర్లక్ష్యమే కారణమని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా అనవసరమైన సమస్యలను ముందుకు తీసుకొచ్చి విషయాన్ని తప్పుదారి పట్టించే ప్రయత్నం చేశారని పేర్కొన్నారు. పాఠశాలకు హాజరు కాకుండా హాజరు శాతాన్ని పెంచుకునేందుకు ఉపాధ్యాయులు హాజరు పట్టికను నింపేశారని తెలిపారు. ఉద్దేశపూర్వకంగానే హాజరు పట్టికపై ఇంకు వేశారన్నారు. పాఠశాల తరచూ వివాదాల్లో ఉంటోందని, విద్యార్థులు, తల్లిదండ్రులతో చర్చలు జరిపినట్లు తెలిపారు. ఫిర్యాదులపై సిబ్బంది, ప్రిన్సిపాల్ వాదనలు విన్నామని, తదుపరి చర్యలకు నివేదికను జిల్లా విద్యాశాఖ అధికారికి అందజేస్తామని తెలిపారు.



దయాకర్‌కు ఎమ్మెల్సీ పదవీ ఇవ్వాలి



నవతెలంగాణ-ఖానాపూర్

అద్దంకి దయాకర్‌కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దాసరి రాజన్న అన్నారు. గురువారం విశ్రాంతి భవనంలో మాలమహానాడు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుడు అద్దంకి దయాకర్ తెలంగాణ ప్రజల తరపున ఉద్యమించిన నాయకుడని తెలిపారు. ఉద్యమ సమయంలో ఆయనపై కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. అటువంటి ఉద్యమకారునికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎమ్మెల్సీ పదవి ఇచ్చి మంత్రివర్గంలోకి తీసుకుంటుందని అందరూ అనుకున్నారని తెలిపారు. కానీ ఎంఎల్‌సీ అభ్యర్థుల జాబితాలో దయాకర్ పేరు లేకపోవడంతో దళితులను అగ్రవర్ణాలు అణచివేస్తున్నాయని తెలుస్తోందని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. దయాకర్‌కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అంబేద్కర్ సంఘం ఉపాధ్యక్షులు రాసమళ్ల అశోక్, మాలమహానాడు జిల్లా కన్వీనర్ నేత శ్యాం, జిల్లా ఉపాధ్యక్షులు బేర తిరుమలేష్, ఖానాపూర్ అసెంబ్లీ కన్వీనర్ మెస సతీష్, రెడ్డిమల్ల దాస్, మగ్గిడి సురేష్, ద్యావతి దామోదర్, కొంపెల్లి రాజేందర్, అభిషేక్ పాల్గొన్నారు.

ప్రజా సేవే ధ్యేయం : ఎమ్మెల్యే రామారావు పటేల్



నవతెలంగాణ-ముథోల్

తనను ఎమ్మెల్యేగా గెలిపించిన ముథోల్ ప్రజలకు సేవ చేస్తానని ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన లబ్దిదారులు 369 మందికి కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు దశల వారీగా మంజూరవుతాయని తెలిపారు. ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ముథోల్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని పేర్కొన్నారు. ముథోల్ నుండి పంచగుడి వరకు డబుల్ రోడ్డు మంజూరుకు ప్రతిపాదనలు పంపామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కోమల్‌రెడ్డి, వివిధ మండలాల తహసీల్దార్లు, ప్రజాప్రతినిధులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
శుక్రవారం | జనవరి 19, 2024 | www.navatelangana.com

నేషనల్ వర్క్‌షాప్‌లో పాల్గొన్న జెడ్పీ చైర్మెన్

నవతెలంగాణ-నార్నూర్



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతిలో ఆరోగ్యకరమైన గ్రామంపై నిర్వహించిన నేషనల్ వర్క్‌షాప్‌లో జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్ పాల్గొన్నారు. కేంద్ర మంత్రి కపిల్ మురేశ్వర్ పాటిల్, ఏపీ ఉప ముఖ్యమంత్రి ముత్యాల నాయుడు హాజరు అయ్యారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు గ్రామాల స్వచత్త, ఆరోగ్యం లాంటి పలు విషయాలపై చర్చించినట్లు జెడ్పీ చైర్మన్ జనార్ధన్ రాథోడ్ తెలిపారు.

అందరి సహకారంతో గ్రామాభివృద్ధి

నవతెలంగాణ-భైంసా



గ్రామస్తుల సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నామని దేగాం సర్పంచ్ బొబ్బిలి శ్రీనివాస్ అన్నారు. గురువారం గ్రామపంచాయతీ కార్యాలయంలో పాలకవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సర్పంచ్ పదవీ కాలం త్వరలో ముగుస్తున్న తరుణంలో చేసిన అభివృద్ధి, చేయాల్సిన పనులపై చర్చించారు. చేసిన పనులకు ఇప్పటి వరకు బిల్లులు మంజూరు చేయలేదని రూ.లక్షలు రావాల్సి ఉన్నాయని సర్పంచ్ తెలిపారు. ఈ సందర్భంగా తన పదవీ కాలంలో సహకరించిన వారికి సర్పంచ్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి భోజన్న, వార్డు సభ్యులు మోహన్ రెడ్డి, అప్పం గోవర్ధన్ రెడ్డి, రాతి కిష్టన్న, కన్నాపురం నారాయణ, గంగాధరల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అధికార పార్టీలో చేరిన భోజారెడ్డి విమర్శలు మానుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పొగిడిన వ్యక్తి, నేడు జోగు రామన్నపై విమర్శలు చేయడం మానుకోవాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అజయ్ అన్నారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు కౌన్సిలర్లు, నాయకులతో కలిసి పాల్గొన్న ఆయన డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి చేసిన ఆరోపణలను ఖండించారు. మాజీ మంత్రి జోగురామన్న ఆయనకు డీసీసీబీ చైర్మెన్ పదవీ రావడంలో అత్యంత కీలక పాత్ర పోషించిన విషయాన్నీ గుర్తు చేశారు. పదవిని అనుభవిస్తూనే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌లోకి చేరడమే కాకుండా జోగు రామన్నపై విష ప్రచారాలు చేయడం సరి కాదన్నారు. గతంలో జోగురామన్నపై వచ్చిన ఆరోపణలను తిప్పికొట్టిన భోజారెడ్డి ప్రస్తుతం ఆయనే ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు అశోక్ స్వామి, సంద నర్సింగ్, పండ్ల శ్రీనివాస్, వెంకన్న, ధర్మపాల్, రామ్ కుమార్, కొండ గణేష్, లక్ష్మణ్, ఇమ్రాన్, మిషు పాల్గొన్నారు.

సీడీ ఆవిష్కరణ



నవతెలంగాణ-ఉట్నూర్

అయోధ్య రామ జన్మభూమిలో శ్రీ రాముని విగ్రహం ప్రతిష్టాపన సందర్భంగా కవన కోకిల బంకట్ లాల్, డా. జే.ఇందల్ సింగ్ బంజారాలు జై శ్రీరామ్ రాజారామ్ అనే పాటను రాశారు. కాగా గురువారం ఈ పాటల సిడిలను మండల కేంద్రంలోని రామాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు దిపక్, రమణారెడ్డి, జాదవ్ మురళీ, విజయ్ జాదవ్, బంజారా యువసేన ప్రధాన కార్యదర్శి మహేందర్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపట్టాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

పట్టణంలోని 12వ వార్డు న్యూ హౌజింగ్ బోర్డ్ పరిధిలోని సర్వే నంబర్ 161ఏ మున్సిపల్ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని యువజన కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం మున్సిపల్ కమిషనర్ ఏ. శైలజను తన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా దుకాణాల నిర్మాణాలు చేపడుతున్నారని, అధికారుల ముందే ఇంత అక్రమలు జరుగుతున్న పట్టించుకోకపోవడం లేదని ఆరోపించారు. నిర్మాణాల కోసం మున్సిపల్ ఆధ్వర్యంలో నాటిన ఏళ్లనాటి చెట్లను కూడా నరికి వేశారని తెలిపారు. రోడ్డుపైనే దర్జాగా నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాలను గుర్తించి కబ్జా కాకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్‌ను కోరినట్టు తెలిపారు. ఈ సమావేశంలో యువజన కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు హార్నాత్, ఎస్సీ సెల్ నియోజకవర్గ చైర్మెన్ చంద్రాల రాహుల్, కాంగ్రెస్ మావల మండల అధ్యక్షుడు శేఖర్, భూమేష్, ఫైయిమ్, ముత్యాల సురేష్ ఉన్నారు.

క్రీడలతో పాటు చదువుల్లోనూ రాణించాలి



నవతెలంగాణ-కుభీర్

యువత క్రీడలతో పాటు చదువుల్లో రాణించాలని మాజీ వీఎస్ఎస్ చైర్మెన్ చంద్రశేఖర్ పటేల్ అన్నారు. మండలంలోని బెల్గాం తండా 1లో స్వర్గీయ సిందే దాజిరావు పటేల్ జ్ఞాపకార్థం నిర్వహించిన క్రికెట్ పోటీలు గురువారం ముగిసాయి. చివరి రోజు డోడార్నా, బెల్గాం గ్రామాల జట్లు తలబడ్డాయి. ముగింపు వేడుకల్లో మాజీ వీఎస్ఎస్ చైర్మెన్ పాల్గొని గెలుపొందిన జట్టుకు ప్రథమ బహుమతి రూ.11వేలు, రెండవ బహుమతి రూ. 7వేలు, మూడో బహుమతి రూ.3500 నగదు, షీల్డ్‌లను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో యువకులు ముందుగా చదువులపై శ్రద్ధ చూపిస్తూ ఆటల పోటీల్లో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్వర్గీయ దాజిరావు పటేల్ కుమారుడు చంద్రశేఖర్ పటేల్, సర్పంచ్ అనిల్ ఉన్నారు.

పేదలపై పెట్టిన కేసులను ఎత్తివేయాలి

- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం



ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జగిత్యాలలో గతేడాది క్రితం ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న పేదలపై పోలీసులు లాఠీచార్జీ చేయించి, గుడిసెలను ధ్వంసం చేసి, పేదలతో పాటు సీపీఐ(ఎం) నాయకులపై నాన్ బెయిలెబుల్ కేసులు పెట్టి, జైల్లో పెట్టడాన్ని ఖండిస్తూ సీపీఐ(ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని సుందరయ్య భవనం ఎదుట ఆందోళన తెలిపారు. ఈ సందర్భంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలంటూ నినాదాలు చేస్తూ హోరెత్తించారు. అనంతరం రహదారిపై రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 60 చోట్ల ప్రభుత్వ భూముల్లో పేదలు గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారన్నారు. ఈ స్థలాలను రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జాలు చేస్తున్నారని, వారికీ వత్తాసు పలుకుతూ స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు పోలీసుల ద్వారా గుడిసెలు తగల బెట్టిస్తూ, కేసులు నమోదు చేయిస్తున్నారని ఆరోపించారు. మూడు రోజుల క్రితం జగిత్యాల, కోరుట్ల పట్టణ కేంద్రాల్లో గుడిసెవాసులపై దాడి చేసి, గుడిసెలకు నిప్పుపెట్టి, పేదలు, సీపీఐ(ఎం) నాయకులపై అక్రమ కేసులు పెట్టారన్నారు. గత ప్రభుత్వం ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వకపోవడంతోనే ఓటమి పాలైందన్న సంగతీ రాష్ట్ర ప్రభుత్వం గమనిస్తే మంచిదన్నారు. ఇప్పటికైనా అరెస్టు చేసిన వారిపై బేషరతుగా కేసులు ఎత్తివేయాలని, పేదలకు ఇండ్ల స్థలాలు పంపిణీ చేయాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, ప్రజాపంథా నాయకులు జగన్ సింగ్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు అన్నమొల్ల కిరణ్, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, ఆర్.సురేందర్, ఆర్.మంజుల జిల్లా నాయకులు, ఎన్.స్వామి, లింగాల చిన్నన్న పాల్గొన్నారు.

జీపీ అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలి

- నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



సమావేశంలో మాట్లాడుతున్న నిర్మల్ జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నవతెలంగాణ-నిర్మల్

గ్రామపంచాయితీల అభివద్ధి ప్రణాళికలు రూపొందించి ఈనెల 27లోగా గ్రామ సభలలో తీర్మాణాలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మండల అభివృద్ధి అధికారులను ఆదేశించారు. మండల్లో మోడల్ అంగన్‌వాడీ ఏర్పాటే చేసే సదుపాయాలు కల్పించాలన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఓరియంటెషన్ సమావేశం నిర్వహించారు. గ్రామపంచాయితీ అభివృద్ధి ప్రణాళికలు, తీర్మాణాలు, ఉపాధి హామీ పనులపై మండలాల వారీగా సమీక్షించారు. గ్రామాల అభివృద్ధికి శాఖల సమన్వయంతో 2024-25 సంవత్సరానికి గాను ప్రణాళికలు రూపొందించుకొని ఈనెల 27న గ్రామ సభల ద్వారా తీర్మాణాలు చేయాలన్నారు. 31లోగా ఆన్‌లైన్ ద్వారా సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. చేపట్టిన పనుల తీర్మాణాలను పరిశీలించి గ్రామ పంచాయితీలలో పూర్తి కాని పనులను జిల్లా, మండల స్థాయి అభివృద్ధి ప్రణాళికలు ద్వారా ఎంపీడీపీ ఫిబ్రవరి 7లోగా తీర్మాణించి 10లోగా అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. పారిశుద్యం, త్రాగునీరు, తదితర అవసరాలను తీర్మాణాలు చేపట్టాలని సూచించారు. ఉపాధి హామీ పనులలో ఎలాంటి అలసత్వం ఉండవద్దని, గ్రామాభివృద్ధికి ఏ పనులు చేపడితే బాగుంటుందో క్షేత్రస్థాయిలో పనులు గుర్తించాలని, పనులపై స్పష్టమైన అవగాహన ఉండాలన్నారు. స్వచ్ఛభారత్‌లో కార్యాలయాలలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. స్వచ్ఛ భారత్ పారిశుద్యం పనులపై ఇంటింటి సర్వే త్వరగా పూర్తి చేయాలని, మురికి కాలువల చివరి భాగంలో ప్రజలకు అవసరమైన కమ్యూనిటీ సోక్ పిట్స్ ఏర్పాటు చేసి పారిశుద్యం మెరుగుపరచాలని ఆదేశించారు. నర్సరీలలో మొక్కలు వంద శాతం బ్రతికేల సంరక్షణ చర్యలు పకడ్బందీగా చేపట్టాలన్నారు. ప్రతి శుక్రవారం వాటరింగ్ డే చేపట్టి మొక్కలు నీరందించాలన్నారు. మండల కార్యాలయాలు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, అలాగే ఉపాధి హామీ సంబంధించిన రికార్డులు, రిజిష్టర్ల నిర్వహణ సక్రమంగా ఉండాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జడ్పీ సీఈఓ సుధీర్, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, ఎంపీడీఓలు, ఎంపీఓలు పాల్గొన్నారు.

గత ప్రభుత్వ నిర్లక్ష్యంగానే రైల్వే ఓవర్ బ్రిడ్జి పనుల్లో అలసత్వం

- బ్రిడ్జి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



రైల్వే ట్రాక్‌పై నడుస్తు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాయల శంకర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గత రాష్ట్ర ప్రభుత్వం ఆలసత్వం కారణంగా రైల్వే ఓవర్, అండర్ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో అలసత్వం జరిగిందని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. గురువారం ట్రాక్ అవతల ఉన్న కాలనీల్లో పర్యటించి ఆర్‌ఓబీ, ఆర్‌యూబీ, ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులపై ఆరా తీశారు. మహాలక్ష్మీ వాడ, తాటిగూడ, వడ్డెర కాలనీల్లో తిరుగుతూ ప్రజలతో మాట్లాడారు. అనంతరం ట్రాక్‌పై తిరుగుతూ పనుల నిర్వహణపై అధికారులతో వివరాలు తెలుసుకుంటు మ్యాప్‌ను పరిశీలించారు. అనంతరం తాంసి బస్టాండ్ రైల్వే గేటు వద్ద ట్రాఫిక్ సమస్య గురించి ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పూర్తిగా తగ్గించేల కృషి చేస్తున్నామన్నారు. 50 శాతం జనాభా ట్రాక్ అవతలే ఉన్నారని, రైల్వే గేటు పడిన సమయంలో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆర్‌ఓబీ, ఆర్‌యూబీకి కేంద్రం అనుమతి ఇచ్చిన గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రెండు సంవత్సరాల క్రితం జరాగాల్సిన భూ సేకరణ ఇంక పెండింగ్‌లో ఉందన్నారు. దానికి సంబంధించి రూ.20 నుంచి 25 కోట్లు విడుదల కాలేదన్నారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జిని మూడు మీటర్లకు పెంచి ఆటోలు, అంబెలెన్స్, బైక్లు వెళ్లేల డిజైన్ చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించామన్నారు. దానికి అనుగుణంగా కేంద్రం నుంచి నిధులు తీసుకువచ్చేల తన వంతుగా పూర్తి కృషి చేస్తానని తెలిపారు. ఆయన వెంట ఆర్‌అండ్ బీ డీఈ సురేష్, రైల్వే శాఖ అధికారులు, బీజేపీ నాయకులున్నారు.

వెబ్ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భల స్టూడియోస్ నిర్మాణంలో ఆదిలాబాద్ జిల్లాకు చెందిన దర్శకుడు సాయిచరణ్ మేంగని రచన దర్శకత్వం వహించిన మజ్ను(ద లవ్ లాస్టింగ్ పెయిన్) అనే వెబ్ చిత్రం చిత్రీకరించారు. దీనికి సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ గురువారం ఆయన నివాసంలో విడుదల చేశారు. ఇందులో నటీనటులుగా అనిరుద్, అంబిక, ప్రశాంత్, వినిత తదితరులు నటించారు. ఈ చిత్రానికి కెమెరామెన్ చిన్నా భూపాల, సంగీతం ప్రశాంత్, మార్క్ ఎడిటింగ్ చలపతి దిలీప్ పని చేశారు. ఆదిలాబాద్‌లో కళాలు, కళాకారులకు కొదవ లేదని త్వరలో ఆదిలాబాద్ పరిసర ప్రాంతంలో సినిమా చేస్తానని దర్శకుడు సాయిచరన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంచనవల్లి రత్నాకర్, రమేష్, కిషన్ గౌడ్, కబీర్ దాస్, జానపద కళాకారుడు మేంగని నర్సయ్య పాల్గొన్నారు.



సూచిక బోర్డులు ఏర్పాటు చేసిన యువసేన సభ్యులు



నవతెలంగాణ-సిరికొండ

ప్రమాదలు జరగకుండా గ్రామ యువసేన సభ్యులు సూచిన బోర్డులు ఏర్పాటు చేసి సామాజిక బాధ్యతను చాటారు. మండల కేంద్రంలో రోడ్డు పక్కనే ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలున్నాయి. ఉదయం, సాయంత్రం పాఠశాల సెలువు సమయంలో వాహనాలు కొంత వేగంగా రావడంతో విద్యార్థులకు ఆటంకాలు కలుగుతున్నాయి. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండ మండల కేంద్రానికి చెందిన యువసేన సభ్యులు రోడ్డుకి ఇరువైపులా ప్రమాద సూచికల బోర్డులను ఏర్పాటు చేశారు. పాఠశాలలో అనుకోని సంఘటనలు జరగకుండా ముందస్తుగా బోర్డులను ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు, ఏఎస్సై కాల్తే రమేష్ అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఓరగంటి పెంటన్న, యువసేన అధ్యక్షుడు సాయిని స్వామి, సభ్యులు ఆశీల దత్తు, మహేష్, మల్లేష్, ప్రవీణ్, సాయి కృష్ణ, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు జైతు, లతీఫ్, దత్తు పాల్గొన్నారు.

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

న్యాయవాదుల సమస్యల పరిష్కరానికి తన వంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. గురువారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కోర్టు ఆవరణలోని వారి కార్యాలయంలో సత్కరించారు. పూలమాలలు వేసి శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం న్యాయవాదుల సమస్యలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఉన్నతమైన కుటుంబాల నుంచే లాయర్లు, వైద్యులు, ఇంజనీర్లు అయ్యేవారన్నారు. కానీ ప్రస్తుతం పేద కుటుంబం నుంచి లాయర్లు, ఇంజనీర్లు, వైద్యులు అవుతున్నారన్నారు. లాయర్లకు ఇండ్ల స్థలాలు ఇచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. ఇది వరకే ప్రభుత్వ భూముల వివరాలను సేకరించామన్నారు. త్వరలోనే పేదలకు పంపిణీ చేసేల చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రాల నగేష్, న్యాయవాదులున్నారు.

ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్


తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు దివంగత నందమూరి తారకరామారావు 28వ వర్ధంతి వేడుకలను ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. గురువారం పట్టణంలోని స్థానిక ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ కార్యాలయ కార్యదర్శి ఆకుల రాము, పార్లమెంట్ కార్యదర్శి గంగసారపు ఓమన్న, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి పతిహార ప్రభాకర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఎన్టీఆర్ పేదల సంక్షేమానికి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత ఎన్టీఆర్ దేనిని కొనియాడారు. తెలుగు ప్రజలకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మావల మండల అధ్యక్షులు తోకల లసమన్న, నాయకులు అరే రాజన్న కె.నరేందర్, మహిళ నాయకురాలు అంబుబాయి, సరస్వతి పాల్గొన్నారు.

గ్రూప్స్ ఉచిత శిక్షణ కొరకు దరఖాస్తులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ డిగ్రీ పాసైన అభ్యర్థులకు గ్రూప్-1,2,3,4 ఫౌండేషన్ కోర్సుకు ఉచిత కోచింగ్‌కు దరఖాస్తులు చేసుకోవాలని బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ గురువారం సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 20వ తేదీ వరకు స్టడిసర్కిల్.సీజీజీ.జీఓవీ.ఇన్ వెబ్ సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఉచిత శిక్షణ ఫిబ్రవరి 1 నుండి ప్రారంభమై నాలుగు నెలల పాటు కొనసాగుతుందన్నారు. గతంలో గ్రూప్స్ శిక్షణ తీసుకున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవద్దని, హాస్టల్ వసతి ఉండదని పేర్కొన్నారు. అభ్యర్థులకు ఆదాయ ధ్రువీకరణ పత్రం రూ.5లక్షల లోపు ఉండాలని, అభ్యర్థుల ఎంపిక విధానం రిజర్వేషన్, డిగ్రీ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా ఉంటుందని తెలిపారు. అమలులో ఉన్న నిబంధనల ప్రకారం స్టడీ మెటీరియల్ అందిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 08732-221280 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

గుంటూరు కారం డైరెక్టర్ క్షమాపణ చెప్పాలి



నవ తెలంగాణ-ఉట్నూర్

ఎన్నో ఉద్యమాలు, హక్కుల సాధనకు మార్క్స్ లెనిన్‌ను ఆదర్శంగా తీసుకుంటారని, అలాంటి గుంటూరు కారం సినిమాలో మాత్రం విలన్ పాత్రకు ఆయన పేరు పెట్టి తప్పుడు సమాచారం ఇస్తున్నారని, వెంటనే డైరెక్టర్ క్షమాపణ చెప్పాలని ప్రగతి శీల యువజన సంఘం జిల్లా కన్వీనర్ వాగ్మారే ప్రజ్ఞశీల్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కమ్యునిస్టు విప్లవకారులు, మార్క్సిస్టులు ఆయనను ఆదర్శంగా తీసుకుంటారన్నారు. కానీ గుంటూరు కారంలో మాత్రం విలన్‌కి ఆయన పేరు పెట్టి సమాజానికి తప్పుడు సంకేతం ఇస్తున్నారని మండిపడ్డారు. లెనిన్ మార్క్సిజంతో రష్యా దేశంలో విప్లవాన్ని విజయవంతం చేశారని గుర్తు చేశారు. దోపిడీ, పీడన, అణచివేత లేని సోషలిస్టు సమాజాన్ని ఏర్పరిచారని తెలిపారు. అలాంటి మహా నాయుడి పేరును గుంటూరుకారం సినిమాలో విలన్‌కి పెట్టడాన్ని ఖండిస్తున్నామన్నారు. అలాగే సినిమాలో అసభ్యకరంగా రాసిన మడతకుర్చీ బూతు పాటనుపెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. డైరెక్టర్ త్రివిక్రమ్, హీరో మహేష్ బాబు బహిరంగ క్షమాపణ చెప్పడంతో పాటు వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళలను చేపడుతామని హెచ్చరించారు.

పత్తి వాహనం బోల్తా

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్



మండలం జగన్నాథ్‌పూర్ గ్రామ సమీపంలోని వాగులో గురువారం ఉదయం పత్తి వ్యాను బోల్తా పడింది. భట్‌పల్లి గ్రామానికి చెందిన బోర్‌కుటి నరేష్ భీమినీ మండలం కర్జి భీంపూర్ గ్రామం నుండి పత్తి నింపుకొని కాగజ్‌నగర్‌కు వస్తున్నారు. ఈ క్రమంలో జగన్నాథ్‌పూర్ గ్రామ సమీపంలో గల వాగులో వాహనం కూరుకుపోయి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరిగనప్పటికీ, పత్తి మాత్రం వాగులో కొంత భాగం తడిచిపోయి కొంతమేర నష్టం వాటిల్లింది.

చెప్రాడకు బయలుదేరిన పాదయాత్ర

బెజ్జూరు : మండలంలోని ఎలుకపెల్లి అభయాంజనేయ ఆలయం నుండి గురువారం ఉదయం మహారాష్ట్రలోని చెప్రాడ ప్రశాంత్‌దామ్‌కు భక్తులు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. ఆంజనేయ స్వామి ఆలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ పూజలు నిర్వహించి పాదయాత్రను ప్రారంభించారు. ఈ పాదయాత్ర బెజ్జూరు నుండి 32 కిలోమీటర్లు కొనసాగింది. పాదయాత్రకు వెళ్లిన భక్తులకు నాగుల్వాయిలో నికాడి బాపురావు ఆధ్వర్యంలో అల్పాహారం ఏర్పాటుచేయగా సామల వెంకటేశం ఆధ్వర్యంలో చాయ్, ఎంపీటీసీ పర్వీన్ సుల్తానా జావిద్ ఆధ్వర్యంలో పండ్లు, మంచినీటి బాటిళ్లను అందజేశారు. అలాగే బారెగూడ గ్రామంలో అల్పాహారం అందించగా సుమారు వెయ్యి మంది భక్తులు చెప్రాడకు బయలుదేరి వెళ్లారు. జై శ్రీరామ్ నినాదాలతో పాదయాత్ర ఘనంగా సాగింది. పాదయాత్రకు వచ్చిన భక్తులకు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పుష్పలత, పాదయాత్ర నిర్వహణ కమిటీ సభ్యులు భాస్కర్‌రాజు, శ్రీకాంత్, మహేందర్, మోహన్, పుల్లూరి సతీష్, మహేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ శ్రీవర్ధన్, బీజేపీ నాయకులు జాడి దిగంబర్, ఉమ్మరి బాలకృష్ణ, తిరుపతి పాల్గొన్నారు.

పరిహారం కోసం ఏండ్లుగా ఎదురుచూపులే

- నాటు పడవ ప్రమాదంలో 11 మంది మృతి
- 13 ఏండ్లుగా నిరీక్షణ
- కనికరించని అధికారులు



పడవ ప్రమాదంలో మృతిచెందిన మృతదేహాన్ని బయటకు తీసుకొస్తున్న పాతచిత్రం

నవతెలంగాణ-కౌటాల

13 ఏండ్ల క్రితం అదో హృదయ ఉదారక సంఘటన. బంధువుల ఇంటికి శుభకార్యానికి వెళ్లిన వారు తిరుగు ప్రయాణంలో అనంతలోకానికి వెళ్లారు. పెన్‌గంగ దాటే క్రమంలో మృత్యువు నాటుపడవ ద్వారా వచ్చింది. దీంతో ఒకే వంశానికి చెందిన ఐదుగురు మరణించారు. ఈ సంఘటన అక్కడి వారందరిని దిగ్భ్రాంతికి గురిచేసింది. ప్రజలు, అధికారులు చలించిపోయారు. పుట్టెడు దు:ఖంలో ఉన్న బాధిత కుటుంబాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు ఓదార్చి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. పరిహారం అందజేస్తామని మృతుల కుటుంబాలకు చెప్పి వెళ్లిపోయిన అధికారులు నేటికి కనబడ లేదు. కౌటాల మండలంలోని వీరవెల్లి నాటుపడవ ప్రమాదం జరిగి నేటికి 13 ఏండ్లు అవుతున్నాయి. బాదిత కుటుంబాలకు పరిహారం అందిస్తామని భరోసా ఇచ్చిన అధికారులు నేటికి పరిహారం చెల్లించలేదు. అయినవాళ్లను కోల్పోయి పరిహారం కోసం బిక్కుబిక్కుమంటూ ఎదురుచూస్తున్న బాధిత కుటుంబాల్లో కొందరు మరణించారు. ఇప్పటికీ పరిహారం అందలేదు.

సంఘటన వివరాలు...

కౌటాల మండలంలోని మహారాష్ట్ర సరిహద్దు గ్రామం వీరవెల్లికి చెందిన 11 మంది 24 ఏప్రిల్, 2011లో ప్రక్కనే ఉన్న మహారాష్ట్రలోని విఠల్‌వాడ గ్రామానికి సమీప బంధువుల వివాహానికి పెన్‌గంగ మీదుగా నాటుపడవలో బయలుదేరారు. నాటుపడవ ప్రమాదవశాత్తు పెన్‌గంగ నది మధ్యలో మునిగింది. అందులో ప్రయాణిస్తున్న 11 మందిలో ఒకే వంశానికి చెందిన ఐదుగురు చంద్రి శ్రీకాంత్(12), చంద్రి భగవాన్(20), చంద్రి నిర్మళాబాయి(50), చంద్రి పరుశురాం(25), మంద్రి భీంరావు(20), పడవ నడిపే మరో వ్యక్తి బహాను మల్కు(32) పడవ ప్రమాదంలో మృతిచెందారు. ఈ సంఘటన స్థలానికి పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు చేరుకొని పంచనామా చేసి బాధిత కుటుంబాలను అన్ని రకాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. నేటికి 13 ఏండ్లు గడుస్తున్నా బాదిత కుటుంబాలకు నయాపైసా పరిహారం అందలేదు. అనేకమార్లు తహసీల్దార్ కార్యాలయంలో తమ వినతులను అందజేసిన అధికారులు ఆ వినతులు చెత్తబుట్టలకే పరిమితం చేశారని బాధితులు కంటతడి పెట్టుకుంటున్నారు. పరిహారం కోసం ఆపద్బంధు పథకం క్రింద దరఖాస్తు చేసుకున్నా పరిహారం రాలేదు. 2011 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఈ సంఘటన జరిగింది. 13 ఏండ్లకు తిరిగి తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందంటూ ఇప్పుడైనా పరిహారం అందుతుందేమోనని బాధితులు గంపెడాశతో ఎదురుచూస్తున్నారు.

కూలి పని చేస్తేనే పూట గడుస్తది

-శాంతాబాయి, వీరవెల్లి

నాటుపడవ యజమాని, భర్త మల్కు పడవ నడుపుతూ ప్రయాణికులతో పాటు చనిపోయాడు. అప్పటి నుండి కూలి పనులు చేసుకుంటు ముగ్గురు కొడుకుల పెండ్లిళ్లు చేశారు. వారు ఇప్పుడు వారు వేరే కాపురం పెట్టుకున్నారు. ఇప్పుడు బ్రతకడమే భారంగా ఉంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి పరిహారం అందేలా చూడాలి.

భార్యను కోల్పోయాను

-చంద్రి విశ్వనాథ్



నాటుపడవ ప్రయాణంలో భార్య నిర్మళాబాయిను కొల్పోయాను. అమ్మానాన్నలపై కుటుంబ పోషణ బారం పడింది. నాయకులు, అధికారులు హామీల వర్షం కురిపించి ఓదార్చారు. ఇప్పటివరకు ప్రభుత్వం నుండి ఎలాంటి ఆర్థిక సాయం అందలేదు. కనీసం పిల్లల చదువుకు సాయం అందించలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకొంటున్నాడు.

ఆ విషాద ఘటనను ఇప్పటికీ మరిచిపోలేను

-మాయాబాయి, వీరవెల్లి



పెండ్లి అయి ఏడాదిన్నర గడవకముందే పడవ ప్రమాదం మా దాంపత్య జీవితంలో విషాదం నింపింది. ఎంతో ఆనందంతో గడపాల్సిన భార్యభర్తల బంధం భర్త అకాల మృతితో తెగిపోయింది. వివాహ వేడుకలకు బయలుదేరిన నా భర్త పరుశురాం(వీఆర్ఏ) పడవ ప్రమాదంలో మృతిచెందారు. నేటికి ఘటన కండ్ల ముందే కనిపిస్తుంది. అప్పుడు గర్భిణీగా ఉన్నాను. కొడుకుకు 12 ఏండ్లు అవుతున్న పరిహారం రాలేదు.

రొంపల్లి గుండాల రోడ్డుకు వారంలో మరమ్మత్తులు

- ఎస్పీ సురేష్ కుమార్



ఎస్పీతో రోడ్డు విషయం విన్నవిస్తున్న రొంపల్లి, గుండాల గ్రామ ప్రజలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహచిన రొంపల్లి నుండి గుండాల వెళ్లే రహదారికి వారం రోజుల్లోపు కోతకు గురైన చోట మరమ్మతులు చేయిస్తామని జిల్లా ఎస్పీ సురేష్ కుమార్ తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిసి సమస్యను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గతంలో రొంపల్లి నుండి గుండాల గ్రామానికి సుమారు 7 కిలోమీటర్ల రోడ్డు నిర్మించామన్నారు. భారీ వర్షాలకు ఆ రోడ్డు కోతకు గురి కావడం బాధాకరమని, తిరిగి ఆ రోడ్డును జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వారం రోజుల్లో పునర్నిర్మిస్తామని గుండాల గ్రామస్తులకు హామీ ఇచ్చారు. పోలీస్ శాఖ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గుండాల సర్పంచ్ కోట్నాక జంగుభాయి, మాజీ ఎంపీటీసీ కోవ మోతిరాం, మర్సుకోల రాము, మర్సుకొల అశోక్, కోట్నాక్ పత్తుబాయి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వార్షిక పరీక్షలకు సన్నద్ధమవ్వాలి

- ఇంటర్మీడియట్ విద్య నోడల్ అధికారి శంకర్



విద్యార్థులతో మాట్లాడుతున్న ఇంటర్మీడియట్ విద్య నోడల్ అధికారి

నవతెలంగాణ-దహెగాం

వార్షిక పరీక్షలకు ఇంటర్ విద్యార్థులు సన్నద్ధమవ్వాలని ఇంటర్మీడియట్ విద్య నోడల్ అధికారి శంకర్ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాలకు హాజరు కావాలన్నారు. ప్రతి ఒక విద్యార్థి ఇప్పటివరకు జరిగిన సిలబస్‌లో ఏవైనా సందేహాలుంటే అధ్యాపకులను అడిగి తెలుసుకోవాలన్నారు. ఈ ఏడాది ప్రారంభమైన ఇంగ్లీష్ ప్రాక్టికల్స్‌లో చక్కగా ప్రాక్టీస్ చేసి మార్కులు సాధించాలని సూచించారు. బైపీసీ విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణులు అవడమే కాకుండా నీట్‌లో ర్యాంకులు సాధించి మెడిసిన్‌లో సీటు కొట్టాలన్నారు. అనంతరం కళాశాల అధ్యాపక బృందం ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అమరేందర్, అధ్యాపకులు చంద్రశేఖర్, బాబాజీ పాల్గొన్నారు.

అంతర్జాతీయ ఓటరు దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

- తహసీల్దార్ ఆర్.శ్రీనివాస్



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న తహసీల్దార్

నవతెలంగాణ-సిర్పూర్(టి)

ఈ నెల 25 అంతర్జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహసీల్దార్ ఆర్.శ్రీనివాస్ అధికారులకు సూచించారు. గురువారం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వివిధ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా సవరణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలని, మార్పులు, చేర్పులతో పాటు చనిపోయిన వారి పేర్ల తొలగింపు, వివాహాలు జరిగి వేరే ఊర్లకు వెళ్లిన వారి పేర్లు తొలగింపు అంశాలపై ప్రతినిధులు సహకరించాలన్నారు. పోలింగ్ కేంద్రం పరిదిలోని ఓటర్లు, ఇతర ప్రాంతాల్లో ఓటు వేసే వారు ఫామ్-8 ద్వారా మార్పులకు అవకాశం కల్పించామన్నారు. ఈ నెల 20, 21వ తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రముందని, జనవరి 2024 వరకు 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని, అందుకు రాజకీయ పార్టీలు సైతం సహకరించాలన్నారు. స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించేందుకు సిబ్బంది వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, వయోజనులు సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మోబినొద్దీన్, జుగాజీరావు, బీఆర్ఎస్ నాయకులు ఇఫ్తత్ హుస్సేన్, బీజేపీ మండల అధ్యక్షుడు ఎలుములె శంకర్, కాంగ్రెస్ నాయకులు సమీర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పనిచేయడం ఇష్టం లేకుంటే వెళ్లిపోవచ్చు

- స్టాండింగ్ కమిటీలో అధికారులపై సభ్యుల ఆగ్రహం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో పనిచేయడం ఇష్టం లేకుంటే అధికారులు వెళ్లిపోవచ్చని, అంతేకానీ అభివృద్ధికి అడ్డుగా మారితే ఊరుకునే పరిస్థితి లేదని జిల్లా ప్రజాప్రతినిధులు, స్టాండింగ్ కమిటీ అధికారులను హెచ్చరించింది. గురువారం జిల్లా పరిషత్ హాల్ లో చైర్మెన్ కోనేరు కృష్ణ, సీఈఓ రత్నమాల అధ్యక్షతన జరిగిన జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీలో ఎమ్మెల్యేలు కోవలక్ష్మి, పాల్వాయి హరీష్ బాబుతో పాటు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అభివృద్ధి నివేదికలు ప్రవేశపెట్టగా అధికారుల ప్రవర్తన తీరుపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా అధికారులకు ఫోన్ చేస్తే కనీసం స్పందించడం లేదని అటువంటివారు ఇక్కడ పనిచేయాల్సిన అవసరం లేదని జిల్లా అటవీశాఖ అధికారిని ఉద్దేశించి ఎమ్మెల్యే కోవలక్ష్మీ అన్నారు. జిల్లాలో రహదారుల నిర్మాణానికి అటవీ అనుమతులు ఇవ్వక అభివృద్ధికి అడ్డుపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పక్కనే ఉన్న మహారాష్ట్రలో తెలంగాణతో సంబంధం ఉన్నచోట రహదారులు పూర్తయ్యాయని వాటికి తెలంగాణలో లింకు రహదారి పూర్తి కాలేదని దీనికి నిదర్శనమే కెరమెరి మండలం జంగుబాయి దేవస్థానమని తెలిపారు. గతంలో అనేక సమావేశాల్లో రహదారులకు అనుమతుల విషయం జిల్లా అటవీ శాఖ అధికారులు దృష్టికి తీసుకువచ్చినప్పటికీ పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విధానాన్ని కొనసాగిస్తే జిల్లాలో పని చేయాల్సిన అవసరం లేదని, అదే సందర్భంలో రానున్న రోజుల్లో ఎటువంటి అనుమతులు లేకుండా అటవీ ప్రాంతంలో మొరంతో రహదారులు నిర్మిస్తామని అప్పుడు ఎవరు అడ్డుపడతారో చూస్తామంటూ హెచ్చరించారు. ఎమ్మెల్యే హరీష్ బాబు వివిధ శాఖలకు సంబంధించిన పని తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు అధికారులు, ప్రజాప్రతినిధులు జవాబుదారితనంగా ఉండాలని జిల్లాలో అది కనిపించడం లేదన్నారు. పులుల మృతికి సంబంధించి ఆదివాసులపై పెట్టిన కేసులను అక్రమమైనవని తెలిపారు. ఎటువంటి లైసెన్సులు లేకుండా రోడ్లమీద పత్తి కొనుగోలు చేస్తూ రైతులను మోసం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ శాఖ అధికారికి సూచించారు. జెడ్పీటీసీ నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో పాలకవర్గం లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అంక్సాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో నిర్మించిన డైట్ భవనం ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని శాఖల అధికారులు పూర్తిస్థాయిలో నివేదికలు తీసుకొని సమావేశానికి రాకపోవడం పట్ల సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశం గత సమావేశాలతో పోల్చితే వాడివేడిగా జరిగిందని చెప్పవచ్చు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

రేషన్ దుకాణం మంజూరు చేయాలి



నవతెలంగాణ-కెరమెరి

మండలంలోని ఖైరి గ్రామపంచాయతీలో రేషన్ షాపు మంజూరు చేయాలని గురువారం తహసీల్దార్ షరీఫ్‌కు వినతిపత్రం అందజేశారు. సమస్యలను తహసీల్దార్‌కు తెలియజేస్తూ పరిష్కరించాలని కోరారు. ఖైరి మాలగూడ, నాయకపు గూడ, ఇంద్ర నగర్, అగర్వాడ గ్రామాల ప్రజలు సరుకులు తీసుకువచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఖైరి, నాయకపు గూడ, ఇంద్రనగర్, మాలగూడ, గ్రామాలకు మోడీ గ్రామంలో, అగర్వాడ గ్రామానికి చౌపన్ గూడలో రేషన్ దుకాణాలున్నాయని తెలిపారు. మార్గ మధ్యలో పెద్దవాగు ఉండడంతో సాంగ్వి, కెరమెరి మీదుగా చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. దూరభారంతో పాటు వ్యయప్రయాసలు తప్పుడంలేదని ఆవేధన వ్యక్తం చేశారు. ఖైరి గ్రామపంచాయతీకి రేషన్ దుకాణం మంజూరు చేస్తే పరిసర గ్రామాలకు సౌకర్యవంతంగా ఉంటుందని కోరారు. స్పందించిన తహసీల్దార్ ఉన్నతాధికారులకు ఈ విషయమై తెలియజేస్తానని హామీ ఇచ్చారని వారు తెలిపారు. అనంతరం మాలీ సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి బాలాజీ ఆధ్వర్యంలో తహసీల్దార్‌ను శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అగర్వాడ సర్పంచ్ గెడం మధుకర్, తిరుపతి, బాపురావు, రాజు పాల్గొన్నారు.

రైతులు, కూలీలు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని అటవీ ప్రాంతంలో సాగుచేస్తున్న రైతులు, వ్యవసాయ కూలీలు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్ఆర్ఓ అప్పలకొండ, బీట్ ఆఫీసర్ అరుణ్‌రెడ్డి అన్నారు. పులి సంరక్షణలో భాగంగా మండలంలోని లక్ష్మీపూర్ గ్రామ పరిధి అటవీ సమీపంలో చేన్లలో పనిచేస్తున్న కూలీలు పులి ఎదురైతే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పత్తి తీసే కూలీలు ఒంటరిగా కాకుండా గుంపులుగుంపులుగా పనిచేయాలని, ఇలాంటి జాగ్రత్తలు తీసుకుంటే ప్రాణహాని నుండి తప్పించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, కూలీలు పాల్గొన్నారు.

28న మేరు సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈనెల 28న మేరు సంఘం జిల్లా కమిటీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం ప్రతినిధులు తెలిపారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రస్తుతం కొనసాగుతున్న పాలకవర్గం కాలపరిమితి ముగియడంతో 28న ఎన్నికలు నిర్వహించడానికి నిర్ణయించామన్నారు. ఎన్నికల్లో నామినేషన్ వేయాలనుకునేవారు రూ. 3వేలు చెల్లించి ఈనెల 22 నుంచి 24 వరకు నామినేషన్, 25న మధ్యాహ్నం 12లోపు విత్ డ్రా చేసుకోవచ్చని తెలిపారు. విత్ డ్రా చేసుకున్న వారికి రూ.1500 తిరిగి ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పోటీ చేసే వారు కమిటీ సభ్యుడు విజయ్ కుమార్‌కు సమాచారం అందించాలని, సెల్ 9701821923 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సత్యనారాయణ, మదునయ్య, శంకర్, పోసన, అశోక్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులను నియమించాలి

- సీఐటీయూ మండల కన్వీనర్ కూటికల ఆనంద్‌రావు



నవతెలంగాణ-కెరమెరి

మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్యులను నియమించాలని సీఐటీయూ మండల కన్వీనర్ కూటికల ఆనంద్ రావు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రెండు నెలలుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుడు లేకపోవడంతో గిరిజన, నిరుపేద ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందని ద్రాక్షగా మారిందన్నారు. ఎంతో మంది నిరుపేదలు ప్రభుత్వ వైద్యంపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. మండలంలో రెండు నెలలుగా వైద్యుడు లేకున్నా కింది స్థాయి సిబ్బందితోనే ప్రతిరోజు వచ్చి పోయే రోజులకు చికిత్సలు అందిస్తున్నారన్నారు. ఇప్పుడిప్పుడే ప్రజల్లో ప్రభుత్వ వైద్యంపై నమ్మకం ఏర్పడడంతో అధిక సంఖ్యలో రోగులు వస్తున్నారన్నారు. ఉన్నతాధికారులు ప్రాథమిక కేంద్రాలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రభుత్వ వైద్యం అందించడంలో జిల్లా వైద్యాధికారులు విఫలమవుతున్నారన్నారు. పేద బడుగు బలహీన వర్గాలకు ప్రభుత్వ వైద్యం అందాలంటే మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులని నియమించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు లక్ష్మణ్, వాగు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతి బాధ్యతను మరింత పెంచుతుంది

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వ ఉద్యోగంలో ఉద్యోగోన్నతి మరింత బాధ్యతను పెంచుతుందని ఆసిఫాబాద్ అటవీ రేంజ్ అధికారి అప్పలకొండ అన్నారు. రేంజ్ పరిధిలో బీట్ అధికారిగా విధులను నిర్వహిస్తున్న కామరాజ్‌కు సెక్షన్ అధికారిగా పదోన్నతి వచ్చి బదిలీ కాగా గురువారం రేంజ్ కార్యాలయంలో ఆయనను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగంలో ఉద్యోగోన్నతి మరింత బాధ్యతను పెంచుతుందన్నారు. విధి నిర్వహణలో ఎటువంటి బేధాలకు తావు లేకుండా చూడాలన్నారు. ఎదిగిన కొద్దీ ఒదిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారులు యోగేష్, ప్రవీణ్ కుమార్, సరోజరాణి, రాజేశ్వర చారి, సెక్షన్ అధికారులు లక్ష్మణ్, అత్తరుద్దీన్, సాయిచరణ్, సత్యనారాయణ, భగవంతరావు, బీట్ అధికారులు స్వప్న, మహేష్,



రజిత, ఉమారాణి, రవి, సుమన్, సాదిక్, రామ్మూర్తి పాల్గొన్నారు.

మైనారిటీ గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని బల్లల మైనారిటీ గురుకుల పాఠశాల బాయ్స్ -1, బాయ్స్ -2, జూనియర్ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాళ్లు సుజాత్ అలీ, ఎంఏ జబ్బార్ గురువారం వేరువేరు ప్రకటనలో పేర్కొన్నారు. 5వ తరగతిలో నూతన అడ్మిషన్లు, 6, 7, 8 తరగతులలో ఖాళీగా ఉన్న మైనారిటీ సీట్ల భర్తీ, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల కోసం అర్హులైన మైనారిటీ విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈనెల 18 నుండి ఫిబ్రవరి 6 వరకు మైనారిటీ గురుకుల పాఠశాలల్లో సంప్రదించవచ్చని తెలిపారు. నాణ్యమైన విద్యాబోధన, హాస్టల్ వసతి కల్పించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రేస్ పాస్టర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-జన్నారం





మండల గ్రేస్ పాస్టర్స్ అసోసియేషన్ నూతన కమిటీని మండల పాస్టర్లు గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడు పాస్టర్ ఏజీవన్ ప్రకాష్, ప్రధాన కార్యదర్శి పాస్టర్ ఎం.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పాస్టర్ ఎస్.దావీద్, సహ కార్యదర్శి పాస్టర్ డి సక్కారం, కోశాధికారి పాస్టర్ బి సుభాష్, ముఖ్య సలహాదారులు పాస్టర్ టి సంతోష్ రాజ్, పాస్టర్ డి సామ్యూల్, పాస్టర్ కె.ఎజ్రా, పాస్టర్ సిహెచ్ ప్రేమానందం, ముఖ్య సభ్యులు పాస్టర్ ఆర్ ప్రకాష్, పాస్టర్ బి.నరేష్, ప్రచార కార్యదర్శి పాస్టర్ ఎం పురుషోత్తంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సందర్భంగా వారు మాట్లాడుతూ క్రిస్టియన్స్ సంక్షేమానికి కృషి చేస్తామని అన్నారు.

గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

● నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నవతెలంగాణ-నిర్మల్

గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో గణతంత్ర దినోత్సవ వేడుకలపై అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలసి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 26 వ తేదీన గణతంత్ర దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.నూతన కలెక్టరేట్‌లో మొదటిసారిగా గణతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించు కుంటున్నామని అన్నారు. పోలీస్, రెవిన్యూ విద్యా వైద్యం విద్యుత్, డీఆర్‌డీఓ, ఉద్యాన వన, ఇతర అన్ని శాఖల సమన్వయతో స్టాల్స్, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ వేడుకలకు జిల్లా అధికారులు సిబ్బంది అందరూ హాజరు కావాలని అన్నారు.

అనక మాణిక్‌రావు సేవలు మరువలేనివి

● ఆసిఫాబాద్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు



నవతెలంగాణ-జైనూర్

మండలంలో అనక మాణిక్‌రావు మరణం తీరని లోటని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. గురువారం మండలకేంద్రంలోని సోనూపటేల్‌గూడకు చెందిన ఉపాధ్యాయుడు మాణిక్‌రావు అంత్యక్రియల్లో వారు పాల్గొని పూలమాలలు వేసి ఘనంగా నివాళు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుమూల ఏజెన్సీ మండలాల్లో గతంలో ఉపాధ్యాయులుగా ఎన్నో సేవలందించి గిరిజనులకు మంచి సేవలందించారని తెలిపారు. ఉపాధ్యాయ వృత్తితో పాటు పలు సామాజిక కార్యక్రమాల్లో కూడా ఆయన ఈ ప్రాంతానికి సేవలు చేశారని కొనియాడారు. ఉపాధ్యాయ వృత్తిలో సేవలందించి రిటైర్‌మెంట్ అయి ఆదివాసులకు ఎల్లవేళల అందుబాటులో ఉండి అనక ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. అనంతరం ఆదివాసీ సంస్కృతి సాంప్రదాయాలతో ఆయన అంత్యక్రియల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అనంతరం మాణిక్‌రావు తనయుడు అనక ఫౌండేసన్ చైర్మన్ అనక దేవేందర్‌కు వారి కుటుంబసభ్యులతో మాట్లాడి ప్రగాఢ సంతాపం తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ కనక యాదవరావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఇంతియాజ్‌లాల, సర్పంచ్ ఆత్రం సుగుణా, భుజంగ్‌రావు, సహకార సంఘం చైర్మన్ కొడప హన్నూపటేల్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-జన్నారం

మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన కమిటీని గురువారం మండల కార్యదర్శిలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా టీ.మహేష్, గౌరవ అధ్యక్షుడిగా ఎస్‌కే ఎజాజ్ ఉపాధ్యక్షులుగా ప్రసాద్, వరలక్ష్మి గంగు లత, కరుణ, ప్రధాన కార్యదర్శిగా జి శ్రీకాంత్, కోశాధికారిగా మధు, భీమ్రావు, సతీష్, కార్యనిర్వాహక కార్యదర్శిగా విశ్వ రమేష్, సంతోష్, వినోద్, సంయుక్త కార్యదర్శిలుగా కళ్యాణి, సరిత, గోపి, వెంకట్, రజిత, లావణ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు టీ మహేష్ మాట్లాడుతూ కార్యదర్శిలు తమ హక్కులను సాధించుకోవడానికి, ఐకమత్యంగా ఉండాలన్నారు. కార్యదర్శుల హక్కుల కోసం నూతన కమిటీ పోరాటం చేస్తుందన్నారు. నూతన కమిటీకి కార్యదర్శులు అంతా సహకరించాలని కోరారు.

సాఫ్ట్‌బాల్ విజేత ఆదిలాబాద్

నవతెలంగాణ-అదిలాబాద్ టౌన్

67వ రాష్ట్ర స్థాయి ఎస్జీఎఫ్ అండర్-14 విభాగం సాఫ్ట్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాలుర జట్టు విజేతగా నిలిచింది. ఈ నెల 16 నుండి 18 వరకు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో మొదటి స్థానం కైవసం చేసుకుని కప్పును అందుకుంది. మొదటి నుంచి దూకుడు ప్రదర్శించి విజేతగా నిలిచిన బాలుర జట్టు సెమీఫైనల్‌లో మహబూబ్‌నగర్ జిల్లాను ఓడించి ఫైనల్‌కు చేరుకుంది. ఫైనల్ లో మెదక్ జట్టును 3-1 తేడాతో ఓడించి ప్రథమ స్థానంలో నిలిచినట్లు జట్టు కోచ్ మేనేజర్లు యాదగిరి, స్వామి తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాలుర జట్టు ప్రథమ స్థానం పొందడం పట్ల జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కాంతారావు, డివైఎస్‌ఓ వెంకటేశ్వర్లు, పెటా అధ్యక్షులు పార్థసారథి అభినందించారు.

21న వ్యవసాయ కార్మిక సంఘం విస్తృతస్థాయి సమావేశం

నవతెలంగాణ-జన్నారం

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా, జగిత్యాల జిల్లాల విస్తతస్థాయి కార్యకర్తల సమావేశం 21 తేదీన ఖానాపూర్ పట్టణంలోని పీఆర్టీయూ భవనంలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు దుర్గం నూతన్ కుమార్, మంచిర్యాల జిల్లా కార్యదర్శి కనికరం అశోక్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన పత్రిక విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమావేశానికి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు, సహాయ కార్యదర్శి బి పద్మ హాజరవుతున్నారన్నారు. మండల అధ్యక్ష కార్యదర్శులు, కార్యకర్తలు, జిల్లా కమిటీ సభ్యులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు డాకూర్ తిరుపతి, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండగొర్ల లింగన్న, మండల అధ్యక్షులు గుడ్ల రాజన్న పాల్గొన్నారు.

మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు దరఖాస్తులు

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

మోడల్ స్కూళ్లలో 2024-25 విద్యా సంవత్సరం కోసం 6 నుంచి 10వ తరగతుల్లో ప్రవేశాల నోటిఫికేషన్ విడుదలైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు జనవరి 12 నుంచి ఫిబ్రవరి 22 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 1 నుంచి హాల్టికెట్లు పొందవచ్చని, అదే నెల 7వ తేదీన పరీక్ష ఉంటుందని తెలిపారు. ఓసీ విద్యార్థులు రూ.200, మిగతా విద్యార్థులు రూ.125 ఫీజు చెల్లించాలని దరఖాస్తు చేసుకునేందుకు తెలంగాణఎంఎస్.సీజీజీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

21న జనసమితి సదస్సు

నవతెలంగాణ-నస్పూర్

21న హైదారాబాద్‌లోని మోక్షంగుండం విశ్వేశ్వరయ్య భవన్‌లో తెలంగాణ జన సమితి పార్టీ రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.బాబన్న పేర్కొన్నారు. గురువారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద రాష్ట్ర సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాబన్న మాట్లాడుతూ రాష్ట్ర సదస్సులో రాష్ట్ర విభజన జరిగి దశాబ్ద కాలం దాటవస్తున్నా విభజన హామీలు అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం అయిందని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ రెండు మార్లు రాష్ట్రాన్ని పాలించినా తమ స్వంత రాజకీయ ప్రయోజాలకే పరిమితం అయిందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తెచ్చి విభజన హామీలు అమలయ్యేలా చేయాల్సిన అవసరం ఏర్పడిందని, అందుకు రాష్ట్ర సదస్సుకు నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి యువత, మేధావులు, ఉద్యమ కారులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని సూచించారు. వివిధ పార్టీల నుంచి తుడుం దెబ్బ ఆదివాసి నాయకులు పెందుర్తి దర్మ్, రమేష్ చంద్ర, అంజయ్య, ఎస్ జాన్, జి.సుదాకర్, ఆరేల్లి అంజిత్, వేముల ప్రేమ్ సాగర్, విరిని రాష్ట్ర ఆర్గనైజ్ సెక్రటరీ బి బాబన్న పార్టీ కండువ కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రామచంద్రరెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి గోనెల శ్రీనివాస్, మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు ప్రదీప్, యువజన అధ్యక్షుడు సిరాజ్, రాష్ట్ర సోషల్ మీడియా సభ్యులు పాములవెంకటసాయి , టిజేఎస్ నాయకులు ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

● మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

నవతెలంగాణ-నస్పూర్



జిల్లాలోని బెల్లంపల్లి నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశించారు. గురువారం జిల్లాలోని బెల్లంపల్లి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, సంబంధిత అధికారులతో కలిసి పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బెల్లంపల్లి నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న వివిధ రకాల అభివృద్ధి పనులను పర్యవేక్షించి సమగ్ర నివేదిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఒక సమావేశం ఏర్పాటు చేసుకొని శాఖల వారిగా కొనసాగుతున్న అభివృద్ధి పనుల ప్రగతిపై ఆయా శాఖల అధికారులు అందించే వివరాల ప్రకారం పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా ప్రణాళికలు రూపొందించడం జరుగుతుందని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఉప కేంద్రాల నిర్మాణాలకు ప్రభుత్వ స్థలాలను ఎంపిక చేసి ప్రతిపాదనలు పంపించాలని, పాఠశాలల్లో బాలబాలికలకు ప్రత్యేక మూత్రశాలలను రెండు నెలల్లోగా పూర్తి చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్, వ్యవసాయ, నీటిపారుదల, ఉద్యానవన, పురపాలక శాఖలు, ఇతర శాఖల పరిధిలో కొనసాగుతున్న పనులపై 10 రోజులలోగా మండలాల వారిగా, శాఖల వారిగా సమీక్ష నిర్వహించడం జరుగుతుందని, అధికారులు సిద్ధంగా ఉండాలని తెలిపారు. విధుల పట్ల అలసత్వం, నిర్లక్ష్యం వహించినట్లయితే చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కోరారు. కొనసాగుతున్న పనులకు సంబంధించిన అనుమతులు తీసుకొని త్వరగా పూర్తి చేసే విధంగా కృషి చేయాలని, ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆసిఫాబాద్ జిల్లా అడ ప్రాజెక్టు నుండి కాకుండా ఎల్లంపల్లి ప్రాజెక్టు నుండి తాగునీటిని బెల్లంపల్లికి సరఫరా చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని, సింగరేణి సంస్థ పరిధిలో నియోజకవర్గంలో చేపట్టవలసిన అభివృద్ధి పనులపై నివేదిక అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల ఇంజనీరింగ్ విభాగాల అధికారులు, మందమర్రి, గోలేటి ఏరియా జనరల్ మేనేజర్లు మనోహర్, రవిప్రసాద్, తహసీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన అవసరం

● జిల్లా వైద్య అధికారి డాక్టర్ జీసీ.సుబ్బారాయుడు

నవతెలంగాణ-హాజీపూర్



హెచ్‌ఐవి ఎయిడ్స్, సుఖ వ్యాధుల నియంత్రణపై ప్రతీ ఒకరు అవగాహన కలిగి వుండాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ జీసీ.సుబ్బారాయుడు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఓవర్ బ్రిడ్జి కూరగాయల మార్కెట్, బస్టాండ్‌లలో వైద్య ఆరోగ్య శాఖ జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన అవగాహన కళాజాత కళాకారుల ప్రదర్శనను జెండా ఊపి ప్రారంభించారు. ఎయిడ్స్ వ్యాధి ప్రధానంగా నాలుగు కారణాల వల్ల వస్తుందని, సుఖ వ్యాధులున్న వారికి హెచ్‌ఐవి వ్యాధి సోకే అవకాశం ఎక్కువ ఉందని జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఉచితంగా హెచ్‌ఐవీ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. పరీక్ష వివరాలు రహస్యంగా వుంచబడతాయని పరీక్ష కొరకు వచ్చిన వారు ఆందోళన చెంద వలసిన అవసరం లేదని చెప్పారు. తల్లికి హెచ్‌ఐవి సోకినా బిడ్డకి సోకకుండా నెవరపిన్ సిరప్ ఉచితంగా ఇస్తారని తెలిపారు. ఈ సందర్భంగా కళజాత బృందం కళాకారులు తమ ఆట పాటలలో ప్రజలకు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా సూపర్ వైజర్ వి.అనిల్ కుమార్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

అన్ని వసతులతో విద్యార్థులకు మెరుగైన విద్య

● మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్



నవతెలంగాణ-వేమనపల్లి

ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులతో కూడిన మెరుగైన విద్యను విద్యార్థులకు అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం జిల్లాలోని వేమనపల్లి మండలంలోని గిరిజన సంక్షేమ-ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయంతో పాటు ప్రాణహిత నదీ తీరాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల ద్వారా విద్యార్థినీ, విద్యార్థులకు అన్ని వసతులతో కూడిన విద్యను అందించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తోందని, ఆ దిశగా సకల సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులతో వైద్యులు, సిబ్బంది స్నేహభావంతో ప్రవర్తించాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవడంతో పాటు విధులలో తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయాలను సందర్శించి రిజిష్టర్లు, రికార్డులను పరిశీలించి అధికారులకు తగు సూచనలు, సలహాలు చేశారు. ప్రభుత్వ పథకాల అమలు, దరఖాస్తుల ప్రక్రియపై చిత్తశుద్ధితో వ్యవహరించాలని, అర్హత గల ప్రతి లబ్దిదారుడికి పథకాల ఫలాలు అందేలా సంబంధిత అధికారుల సమన్వయంతో పని చేయాలని అన్నారు. అనంతరం ప్రాణహిత నదీ తీరాన్ని పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సదానందం, ఎంపీఓ శ్రీపతి బాపు, పాల్గొన్నారు.

16న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వార్షిక సమావేశం

నవతెలంగాణ నస్పూర్



ఫిబ్రవరి 16వ తేదీన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వార్షిక సర్వసభ్య సమావేశంతో పాటు నూతన కార్యవర్గ ఎన్నికల ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోగల అదనపు కలెక్టర్ చాంబర్‌లో సొసైటీ వార్షిక సర్వసభ్య సమావేశం, కార్యవర్గ ఎన్నిక సంబంధిత రాష్ట్ర శాఖ ఉత్తర్వులను జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి డా.సాగి అనిల్ కుమార్, వైస్ చైర్మన్ చందూరి మహేందర్‌తో కలిసి జిల్లా అదనపు కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంచిర్యాల జిల్లా శాఖ అధ్యక్షులు, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వార్షిక సర్వసభ్య సమావేశం, నూతన కార్యవర్గ ఎన్నిక ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రెడ్ క్రాస్ సొసైటీలో శాశ్వత సభ్యత్వం గల పోషకులు, ఉప పోషకులు, జీవిత సభ్యులు, జీవిత సహచరులతో ఫిబ్రవరి 16న సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో వార్షిక సర్వసభ్య సమావేశం, నూతన కార్యవర్గ ఎన్నిక ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందని, ఇందులో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంచిర్యాల జిల్లా శాఖలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నమోదు అయిన శాశ్వత సభ్యత్వం పొందిన వారు తమ రెడ్ క్రాస్ గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు, ఓటరు గుర్తింపు, డ్రైవింగ్ లైసెన్స్, ఇతర ఫోటో గుర్తింపు కార్డులతో తప్పనిసరిగా హాజరు కావాలని తెలిపారు. సభ్యత్వం పొందిన వారి చిరునామా వివరాలలో మార్పులపై ప్రత్యేకంగా ఫోన్ చేసి సమాచారం సేకరించడం జరిగిందని, ఇతర సభ్యులు చిరునామాలో మార్పులు కావాలనుకునే వారు తమ వివరాలను తగిన ఆధారాలతో లిఖిత పూర్వకంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో గల రెడ్ క్రాస్ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ మేనేజ్మెంట్ కమిటి సభ్యులు వ్యాసభట్ రాధాకృష్ణ, జిల్లా కోశాధికారి పడాల రవీందర్, జిల్లా కమిటి సభ్యులు మధుసూదన్‌రెడ్డి, కాసర్ల శ్రీనివాస్, సత్యపాల్‌రెడ్డి, ఎడ్ల కిషన్, నాగేందర్ పాల్గొన్నారు.

జీపీల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని 335 గ్రామపంచాయతీలలో ప్రాథమిక అవసరాలను గుర్తించి సదుపాయాలు కల్పించేందుకు అభివృద్ధి ప్రణాళికలను పకడ్బందీగా రూపొందించాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. గురువారం గ్రామ అభివృద్ధి ప్రణాళికపై పంచాయతీ కార్యదర్శులతో ఇంజనీరింగ్, మహిళ అభివృద్ధిపై ఏర్పాటుచేసిన శిక్షణ కార్యక్రమానికి జిల్లా పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపట్టిన గ్రామపంచాయతీల అభివృద్ధి ప్రణాళికలను పకడ్బందీగా రూపొందించాలని, గ్రామాలలో పనిచేస్తున్న 29 శాఖలను సమన్వయం చేసుకొని గ్రామసభలను నిర్వహించి ప్రణాళిక రూపొందించి ఈ-గ్రామసభ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామపంచాయతీలో గ్రామసభలను నిర్వహించాలని, శిశ, మహిళ అభివృద్ధి, ఆరోగ్యం అంశాలపై పరిశీలించి గ్రామసభలలో వివరాలు తెలియజేయాలని, ప్రజలతో, గ్రామపంచాయతీ పాలకవర్గంలో చర్చించి ప్రణాళిక రూపకల్పనకు కృషి చేయాలని, ఆయా గ్రామాలలో జరుగుతున్న అభివృద్ధి పనులు, రోడ్లు, భవనాల నిర్మాణాలు, తాగునీరు, వ్యవసాయం, ఇతర రంగాలలో జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులు దృష్టి సారించాలని, సీఎస్‌ఆర్ నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులపై ప్రత్యేకంగా పర్యవేక్షించాలని తెలిపారు. రూపొందించిన ప్రణాళికల వివరాలను ఈ నెల 31వ తేదీలోగా ఈ-గ్రామ స్వరాజ్ పోర్టల్‌లో నమోదు చేయాలని తెలిపారు.



ఓటరు జాబితాలో రాజకీయ పార్టీల పాత్ర కీలకం



నవతెలంగాణ-జైనూర్

ఓటరు జాబితా రూపొందించడంలో రాజకీయ పార్టీల పాత్ర కీలకమైందని లింగాపూర్ తహసీల్దార్ వెడ్మ రాజేంద్రప్రసాద్ అన్నారు. గురువారం లింగాపూర్ మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓ, ఆర్‌ఐతో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులతో ఓటరు జాబితా రూపకల్పనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. 18 ఏండ్లు నిండిన వారిని గుర్తించి వారికి అవగాహన కల్పించేందుకు రాజకీయ పార్టీల నాయకులు కూడా సహకరించాలని కోరారు. ఓటరు జాబితాలో పేర్లు, చిరునామా వివరాలు సవరణ కోసం బూత్‌స్థాయి అధికారుల ద్వారా దరఖాస్తులు చేసుకొని ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. మరణించిన వారి వివరాలు జాబితా నుండి తొలగించేందుకు భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు నోటీసు ప్రక్రియను పూర్తిచేసి తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ నెల 20, 21వ తేదీల్లో జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటుచేయడం జరుగుతుందని తెలిపారు. వచ్చే పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఓటర్లకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చూడాలన్నారు. ఓటరు జాబితా రూపొందించడానికి అధికారులకు ప్రజా ప్రతినిధులు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ నెల 25వ తేదీన జరిగే జాతీయ ఓటరు దినోత్సవం కోసం ప్రత్యేక జాబితా నిర్వహించి విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు.

గ్రామాల్లో డీపీఈపీ గ్రామసభలు

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని తపాలాపూర్, తిమ్మాపూర్ గ్రామపంచాయతీలో గురువారం సర్పంచులు నయనాల తిరుపతి, జాడి గంగాధర్ అధ్యక్షతన డీపీఈపీ గ్రామసభలు నిర్వహించారు. ఈ గ్రామసభలో 2024-25 సంవత్సరానికి సంబంధించిన ముందస్తు అభివృద్ధి ప్రణాళికల గురించి చర్చించారు. గ్రామంలో ఎలాంటి మిగులు పనులు ఉన్న వాటిని పూర్తి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమలో కార్యదర్శి లావణ్య, వార్డు సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-జన్నారం

జన్నారం పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు తోకల సురేష్ గత 15 రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖ నాయక్ గురువారం పరామర్శించారు. వారి కుటుంబానికి మనో ధైర్యాన్ని ఇచ్చారు. అతను పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. వారి కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామన్నారు. ఆమెతోపాటు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముత్యం సతీష్, డైరెక్టర్లు రజాక్ మున్ను, మౌలానా, నోముల రాజకుమార్ ఉన్నారు.

ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు సన్మానం

నవతెలంగాణ-కాసిపేట



మంచిర్యాల జిల్లా కేంద్రంలో మండల ఆదివాసి సేన కమిటీ ఆధ్వర్యంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను మర్యాద పూర్వకంగా కలిసి, శాలువాలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్, ఆదివాసీ సేన మండల అధ్యక్షుడు మడావి వెంకటేష్, గౌరవ అధ్యక్షుడు మడావి గంగారాం, వర్కింగ్ ప్రెసిడెంట్ పెంద్రం శంకర్, ఉపాధ్యక్షుడు పెంద్రం ప్రభాకర్, కోశాధికారి ఆత్రం సంజీవ్, సలహాదారుడు కుర్సింగ ఇశు పాల్గొన్నారు.

24న బాలిక దినోత్సవ వారోత్సవాలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని అన్ని రకాల ఉన్నత పాఠశాలలో ఈ నెల 24 వరకు బాలిక దినోత్సవ వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని సావిత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనిలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించడం జరుగుతుందని, తల్లిదండ్రుల సమావేశాలు ప్రత్యేకంగా ఏర్పాటు చేయాల్సి ఉంటుందని, పోటీలలో గెలుపొందిన వారికి ఈ నెల 24వ తేదీన కలెక్టరేట్‌లో నిర్వహించే బాలిక దినోత్సవం బహుమతుల ప్రధానం చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో 2.5 క్వింటాళ్ళ పీడీఎస్ బియ్యాన్ని టాస్క్ ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. టాస్క్ ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్ తెలిపిన వివరాల ప్రకారం... జిల్లా కేంద్రంలోని హరిబాబు అనే వ్యక్తి తనకు సంబంధించిన కిరాణా దుకాణంలో పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచడన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. దీనిలో 2.5 క్వింటాళ్ళ పీడీఎస్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు. పీడీఎస్ బియ్యం నిల్వ ఉంచితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో టాస్క్ ఫోర్స్ ఎస్సై సందీప్ కుమార్, పీసీ మధు, రమేష్, సంజీవ్ పాల్గొన్నారు.

అయోధ్య రాములోరి అక్షింతల వితరణ

నవతెలంగాణ-వేమనపల్లి

అయోధ్య రాములోరి అక్షింతలు ఇంటింటికి చేర్చే కార్యక్రమంలో భాగంగా గురువారం నీల్వాయి గ్రామంలో జడ్పీటీసీ దంపతులు రుద్రభట్ల స్వర్ణలత-సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా శోభయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సయ్యద్ సాబీర్ అలీ, సర్పంచ్ గాలి మధు, మాజీ సర్పంచ్ తిరుపతిరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ తిరుపతిరెడ్డి, డీలర్ రెబ్బెన మధూకర్, చెన్నూరి చందు, శ్రీరాములు రమేష్ పాల్గొన్నారు.

మృతుని కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్



మండలంలోని జందాపూర్ గ్రామానికి చెందిన జక్కుల స్వామి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న గురువారం కుటుంబాన్ని పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని చెప్పారు. ఆయన వెంట పార్టీ నాయకులు మెట్టు ప్రహ్లాద్, ఇజ్జగిరి నారాయణ, ప్రశాంత్ రెడ్డి, గంగారెడ్డి ఉన్నారు.

పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా దుప్పట్లు పంపిణీ

నవతెలంగాణ-రెబ్బెన

మానవసేవే మాధవసేవ అనే నినాదంతో గోలేటిలోని వృద్ధాశ్రమంలో ఉన్న నిరాశ్రయులకు, నిరుపేదలకు, వృద్ధులకు చలికాలం సందర్భంగా పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా ఎస్సై చంద్రశేఖర్ గోలేటిలో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధులకు, నిరుపేదలకు చలికాలాన్ని దృష్టిలో ఉంచుకొని తనవంతు సాయంగా దుప్పట్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. చాలామంది నిత్సహాయులు చలిలో వీధుల్లో నిద్రపోతారని ఆవేధన వ్యక్తం చేశారు. చలికాలంలో దుప్పట్లు చలి నుండి కాపాడుకోవడానికి కొంతవరకైనా ఉపయోగపడుతాయని మానవతా దృక్పథంతో దుప్పట్లను పంపిణీ చేశామన్నారు. దాతలు కూడా ముందుకు వచ్చి పేదలను ఆదుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదల నివారణకు నిబంధనలు పాటించాలి



నవతెలంగాణ-తలమడుగు

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని మోటర్ వెహికిల్ ఇన్స్పెక్టర్ రామారావ్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం డ్రైవర్లు, విద్యార్థులు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ముందుగా రోడ్డు భద్రతపై ముద్రించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రత నిబంధనల గురించి తెలుసుకోవాలని సూచించారు. మైనర్ పిల్లలకు వాహనాలను ఇవ్వడం నేరామన్నారు. మైనార్లు డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాలకు కారణం అయితే తల్లిదండ్రులపై చర్యలు ఉంటాయన్నారు. ప్రమాదం జరగకముందే అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు జనవరి 15 నుండి ఫిబ్రవరి 14 వరకు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి రమాకాంత్, ఎంపీటీసీ చంటి, ఉన్నత పాఠశాల హెచ్ఎం వెంకట్‌రావు, ఎస్సై ధనశ్రీ, ఏఎంవీఐ భీక్షపతి, పంచాయతీ కార్యదర్శి అశోక్, ఉపాధ్యాయులు వినోద్ రెడ్డి, మేకల మురళీధర్, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మైనార్టీ గురుకులాల్లో అడ్మిషన్లు ప్రారంభం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్


2024-25 విద్యా సంవత్సరానికి మైనార్టీ గురుకులాలు, కళాశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ ఈనెల 18 నుండి ప్రారంభమైందని డీఎండబ్ల్యూఓ రమేష్ రాథోడ్ తెలిపారు. గురువారం జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని ఆరు గురుకులాలు, ఆరు కళాశాలల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. గురుకులంలో 5వ తరగతిలో కొత్త సీట్లు, 6,7,8 తరగతుల్లో బ్యాక్ లాగ్ ఖాళీలు అదే విధంగా కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్లు ఉన్నాయని తెలిపారు. అసక్తి గల వారు ఆన్‌లైన్ లేదా సంబంధిత గురుకులాలు, కళాశాలల్లో నేరుగా వెళ్లి దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. గురుకులాల్లో నాణ్యమైన విద్యతో పాటు భోజనం, వసతి ఉంటుందని తెలిపారు.

కొనసాగుతున్న ఆటలు

నవతెలంగాణ-ఉట్నూర్

పట్టణంలోని కుమురం భీం(కేబీ)ప్రాంగణంలో రాష్ట్ర స్థాయి ఆటలు కొనసాగుతున్నాయి. ఇంటర్ గురుకుల సొసైటీ లీగ్ క్రీడాల్లో రెండో రోజు రనింగ్, హై జంప్, వాలీబాల్ పోటీల్లో క్రీడాకారులు ఉత్సహంగా పాల్గొన్నారు. గురువారం ఐటీడీఏ పీఓ చాహత్ బాజ్‌పాయ్, డిప్యూటీ డైరెక్టర్ దిలీప్ కుమార్ పోటీలను పరిశీలించి ఆటలను తిలకించారు. ఆటల్లో ప్రతిబ కనబర్చిన వారికి బహుమతులను అందిస్తామన్నారు.

ఉపాధ్యాయుల అక్రమ డిప్యూటేషన్లు రద్దు చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో, ఎయిడెడ్ పాఠశాలల్లో అక్రమంగా డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న వారి డిప్యూటేషన్లు రద్దు చేయాలని కేవీపీఎస్, డీవైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆ సంఘాల ఆధ్వర్యంలో జిల్లా విద్యాధికారి అశోక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమ డిప్యూటేషన్లతో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు ఇష్టారాజ్యంగా విద్యార్థులకు నష్టం చేస్తున్నారన్నారు. వాంకిడి, తిర్యాణి, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ మండలాలలో అధికంగా డిప్యూటేషన్లు ఉన్నాయని, ఒకపక్క ప్రభుత్వం డిప్యూటేషన్లు ఇవ్వద్దని నిబంధనలో ఉన్నా సుప్రీంకోర్టు డిప్యూటేషన్‌లపై ఇచ్చిన తీర్పును ధిక్కరిస్తూ జిల్లాలో డిప్యూటేషన్లు కొనసాగుతున్నాయన్నారు. అటువంటి వారిని గుర్తించి వారి డిప్యూటేషన్లు రద్దు చేయాలని లేదంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ పాల్గొన్నారు.

ప్రతి మొక్కను కాపాడుకోవాలి



నవతెలంగాణ-ఉట్నూర్

ఐటీడీఏ పరిధిలోని నర్సరీల్లో పెంచుతున్న ప్రతి మొక్కను కాపాడాలని ఐటీడీఏ ప్రత్యేక అధికారి, ట్రైనీ కలెక్టర్ వికాస్ మొహతే అన్నారు. గురువారం ఐటీడీఏ నర్సరీలో ఉన్న మామిడి, జామ, సపోట తోటలు పరిశీలించారు. ప్రయోగాత్మకంగా సాగు చేసిన బంతి, మునగ, పసుపు, కూరగాయ పంటల సాగు, ఉట్నూర్, బెల్లంపల్లి, జంబుగ, భీమారం నర్సరీల్లో జరుగున్న అభివృద్ధి పనులు, డ్రిప్, మల్చింగ్ విధానాల గురించి వాటి ఉపయోగాల గురించి అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఓ సందీప్ కుమార్, సాంకేతిక సహాయకులు కుమారి అర్పిత పాల్గొన్నారు.

క్షేత్ర పరిశీలన పకడ్బందీగా చేపట్టాలి

- పీఎం-జన్ మన్ పథకం అమలుపై అధికారులతో కలెక్టర్ సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజాపాలన దరఖాస్తుల క్షేత్ర పరిశీలన పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజాపాలన దరఖాస్తుల క్షేత్ర పరిశీలన, ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు, పీఎం-జన్ మన్ పథకం అమలుపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన దరఖాస్తుల డేటా నమోదు ప్రక్రియ పూర్తయినందున క్షేత్ర పరిశీలనకు అధికారులు సంసిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు పాటిస్తూ, పారదర్శకంగా దరఖాస్తుల క్షేత్ర పరిశీలిన చేపట్టాల్సి ఉంటుందన్నారు. ఆధార్ కార్డు లేని వారికి తప్పనిసరిగా నమోదు చేయించాలన్నారు. అలాగే ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. రెండు పడకగదులు ఇల్లు, ప్రభుత్వ ఉద్యోగాల కోసం, ఇతరత్రా దరఖాస్తులపై అర్జీదారులకు రాతపూర్వకంగా సమాచారం అందించాలన్నారు. అర్హులైన ఓటర్లను నమోదు చేయించాలని, ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితా ప్రచురించనున్న నేపథ్యంలో సమగ్ర ఓటర్ జాబితా రూపకల్పనకు అధికారులు క్షేత్ర స్థాయిలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఓటర్ నమోదు, మరణించిన, చిరునామా మార్పులు, చేర్పులు వంటివి ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ఈ నెల 15 ప్రారంభించిన పీఎం-జన్ మన్ పథకం అమలుకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని సూచించారు. మండలాలు, గ్రామాల వారీగా పీవీటీజీ కుటుంబాలను గుర్తించి పథకంపై వివరించి ఆధార్, ఓటరు, కుల ధ్రువీకరణ పత్రాలు అందించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం స్త్రీ శిశు సంక్షేమ శాఖపై కలెక్టర్ సమీక్షిస్తూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు ప్రతిరోజు పౌష్టికాహారం అందించాలని సూచించారు. చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ వహించి సామ్-మామ్‌పై నిరంతరం పర్యవేక్షించాలని సీడీపీఓలను ఆదేశించారు. ఈ సమావేశాల్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బు గుప్త, ఆర్డీఓ స్రవంతి, డీఆర్డీఓ కిషన్, జెడ్పీ సీఈఓ గణపతి, డీపీఓ శ్రీనివాస్, మున్సిపల్ కమీషనర్ శైలజ, డీడీ దిలీప్ కుమార్, ఎంపీడీఓలు, అధికారులు పాల్గొన్నారు.

మధ్యాహ్నభోజన కార్మికుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

నవతెలంగాణ-రెబ్బెన

మధ్యాహ్నభోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే చెల్లించాలని సీఐటీయూ అనుబంధ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వెలిశాల కృష్ణమాచారి డిమాండ్ చేశారు. గురువారం ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఎంఈఓ వెంకటస్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వెలిశాల కృష్ణమాచారి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం పెండింగ్ బిల్లులు ఇవ్వకుండా మోసం చేసిందని ఆరోపించారు. కనీసం ఈ ప్రభుత్వమైనా కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ మెనిఫెస్టోలో ప్రకటించిన రూ.10 వేల వేతనాలు వెంటనే అమలుచేయాలన్నారు. గత ప్రభుత్వంలో కార్మికులు ప్రశ్నించే పరిస్థితి లేకుండా ఉందని, ఇప్పుడున్న ప్రభుత్వమైనా కార్మికులకు అదనపు భారం తగ్గించి పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే విడుదల చేయాలని కోరారు. రాజకీయ ఒత్తిడితో కార్మికులను తొలగింపు చర్యలకు పాల్పడితే సహించేదిలేదన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్నభోజన కార్మికులు, నాయకులు రామటెంకి విజయ, ఏదుల రాజేశ్వరి, కృష్ణవేణి, మద్దెల భాగ్య, హసీనా, ఈశ్వరి, పాగిడి మాయ పాల్గొన్నారు.

కార్యకర్తలకు, కార్మికులకు అండగా ఉంటా

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవలక్ష్మి

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలో గత నెలలో జరిగిన సింగరేణి ఎన్నికల్లో టీబీజీకేఎస్ యూనియన్‌కు నమ్మిన బంటుగా ఉండి యూనియన్ నిర్ణయం ప్రకారం పనిచేసిన నాయకుడికి, కార్యకర్తకు అండగా ఉంటానని ఆసిఫాబాద్ శాసనసభ్యురాలు కోవలక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని గోలేటిలో తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం యూనియన్ కార్యాలయంలో టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటానని, ఎవరూ మనోధైర్యం కోల్పోవద్దని కార్యకర్తలకు భరోసా కల్పించారు. కేసీఆర్ సింగరేణి ఉద్యోగులకు ఎనలేని హక్కులు కల్పించిన గొప్ప నాయకుడన్నారు. కలిసి కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామని ఆమె పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో ఇదే ఐకమత్యాన్ని చాటి ఒకేతాటిపై నిలబడాలని, కార్యకర్తలు ఎల్లప్పుడు పార్టీ నిర్ణయానికి కట్టుబడి పనిచేయాలన్నారు. కేసీఆర్ నాయకత్వంలో ఏ ఎలక్షన్లు వచ్చిన కేసీఆర్ నియమించిన అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ కమిటీ నాయకులు మంగీలాల్, ఏరియా కమిటీ నాయకులు గజ్జెల్లి చంద్రశేఖర్, మాన్కు సమ్మయ్య, మారిన వెంకటేశ్, మాజీ వైస్ ప్రెసిడెంట్ నలగొండ సదాశివ్, అలవేని సంపత్, ఖైరిగూడ ఫిట్ కార్యదర్శి కార్నాదం వెంకటేశ్, సీహెచ్‌పీ ఫిట్ కార్యదర్శి మెరుగు రమేష్, ఏరియా ఆస్పత్రి ఫిట్ కార్యదర్శి అనుముల సత్యనారాయణ, సివిల్ డిపార్టుమెంటు ఫిట్ కార్యదర్శులు శ్రీనివాస్, విజ్ఞన్న, జీఎం కార్యాలయం అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శి మంకయ్య, స్టోర్ కార్యదర్శి రమేష్, ఏరియా మహిళా నాయకురాలు వరలక్ష్మి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ఘోర రోడ్డుప్రమాదం

- క్యాబిన్‌లో ఇరుక్కున్న పలువురు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గుడిహత్నూర్ మండలం వాఘాపూర్ ఎక్స్ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ముందువెళు తున్న బోర్ వెల్ లారీని కంటైనర్ ఢీకొనడంతో బోర్వెల్ లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బోర్‌వెల్ లారీలోని క్యాబిన్‌లో చిక్కుకున్న పలువురికి తీవ్ర గాయాలపాలయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని స్థానికుల సాయంతో క్షతగాత్రులను బయటకు తీసి చికిత్స నిమిత్తం హుటాహుటిన రిమ్స్‌కు తరలించారు. పోలీసులు, స్థానిలకుల వివరాల ప్రకారం.. కంటైనర్ అదుపుతప్పి రాంగ్‌రూట్‌లో అవతలివైపు రహదారిపైకి వెళ్లి ఎదురుగా వస్తున్న బోర్‌వెల్ లారీని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. దీంతో ఆ లారీలో పలువురు ఇరుక్కుపోయారు. వారిని అందులో నుంచి బయటకు తీసి పోలీసులు రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో బోర్ వెల్ లారీలోని బెల్లంకొండ వెంకటేష్, బెల్లంకొండ వినయ్, అల్లం రోషన్, అల్లం వివేక్, శంభుతో పాటు ప్రమాదానికి కారణమైన కంటైనర్ డ్రైవర్ సునీల్ యాదవ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రగాయలైన వారికి ప్రస్తుతం రిమ్స్‌లో వైద్యులు మెరుగైన వైద్యం అందిస్తున్నారు. కాగా ఈ ప్రమాదంతో జాతీయ రహదారిపై దారిపొడవునా కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించిపోయింది. భారీ వాహనాలు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. చివరగా పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.





లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి

- తుడుం దెబ్బ రాష్ట్ర ప్రచార కార్యదర్శి కొడప నగేష్



మాట్లాడుతున్న తుడుం దెబ్బ నాయకులు

నవతెలంగాణ-తలమడుగు

మహారాష్ట్ర నుంచి అక్రమంగా వచ్చి తెలంగాణలో లబ్ది పొందుతున్న లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే వరకు ఉద్యమం కొనసాగిస్తామని ఆదివాసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రచార కార్యదర్శి కొడప నగేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్ అన్నారు. గురువారం మండలంలోని ఝరిపున గూడ గ్రామంలో ఏర్పాటు చేసిన తుడుం దెబ్బ సమావేశంలో వారు మాట్లాడుతూ ఆదిలాబాద్ ఆనుకొని ఉన్న పరిసరాల మండలు తలమడుగు, తాంసి, బేల, జైనథ్ మండలాల్లో ఈ మధ్య కాలంలో మహారాష్ట్ర నుంచి వలసలు విపరీతంగా పెరిగయని తెలిపారు. వాటిని అరికట్టడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమవుతున్నాయన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా జంగాల పోచ్చన్న, కార్యనిర్వాన అధ్యక్షుడిగా గోడం భూజంగ్‌రావ్, ఉపాధ్యక్షులుగా మేశ్రం విలాస్, పంద్రం రామేష్, తోడసం హేమంద్రష్, పేందూర్ మాదవ్, ప్రధాన కార్యదర్శి గోడం ఈశ్వర్, కోశాధికారిగా నీలగిరి అశోక్, కార్యదర్శులుగా దేవారి పోచ్చన్న, మడావి కాంతారావు, మడావి యదువరావు, నరేంద్ర, సాంస్కృతిక కార్యదర్శిగా కనక సురేందర్, ప్రచార కార్యదర్శులుగా మేశ్రం సంబు, చహకటి సురేష్, సలహాదారులుగా రామేష్, మండవి దేవురావు తదితరులను ఎన్నుకున్నారు.

భాషా సామర్థ్యాలు పెంచడమే ప్రాక్టికల్ లక్ష్యం

- డీఐఈఓ నైతం శంకర్



విద్యార్థులతో మాట్లాడుతున్న విద్యాధికారి నైతం శంకర్

నవతెలంగాణ-రెబ్బెన

విద్యార్థులు ఇంగ్లీష్ భాషా సామర్థ్యాలు పెంచడమే ప్రాక్టికల్ లక్ష్యమని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి నైతం శంకర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి ఇంగ్లీష్ ప్రాక్టికల్‌కు సంబంధించి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంగ్లీష్‌పై ఉన్న భయం పోగొట్టే ఉద్దేశ్యంతో ఇంటర్ మీడియట్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ పరీక్షలు తీసుకువచ్చారన్నారు. దీనిలో కేటాయించబడిన 20 మార్కులను నాలుగు రకాలుగా విభజించినట్లు తెలిపారు. వీటి ద్వారా విద్యార్థుల్లో సంభాషణ నైపుణ్యాలు పెరిగే అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటి వరకు తెలుగు మీడియంలో చదివిన వారికి ఇంగ్లీష్ పట్ల ఉన్న భయం పోతుందన్నారు. ప్రతి ఒక్కరు ప్రాక్టికల్ పరీక్షకు హాజరుకావాలని, ఇంటర్మీడియట్‌లో ఫెయిల్ మెమో వస్తుందన్నారు. ఫిబ్రవరి 16వ తేదీన ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్ష ఉంటుందని, ప్రధాన పరీక్ష 80 మార్కులకు ఉంటుందన్నారు. విద్యార్థులకు దీనిపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉందన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సతీష్, శ్రీనివాస్, ప్రకాష్, మంజుల, దుర్యోధన్, వెంకటేశ్వర్, సుశీల్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



విరాళంగా సేకరించిన నగదును అందజేస్తున్న యువకులు

నవతెలంగాణ-బెజ్జూరు

మండలంలోని కుకుడా, పోతపల్లి గ్రామాల మధ్యలో ఇటీవల జరిగిన బైక్ ప్రమాదంలో గాయాలపాలైన తలాండి పురుషోత్తంకు ఆర్థిక సాయం అందించారు. ప్రమాదంలో గాయపడిన ఆయనకు వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు. తలాండి పురుషోత్తం వైద్య ఖర్చుల నిమిత్తం దాతల ద్వారా సేకరించిన రూ.13520 నగదును స్థానిక యువకులు బాధిత కుటుంబసభ్యులకు గురువారం బెజ్జూరు గ్రామపంచాయతీలో అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబసభ్యులు మాట్లాడుతూ వైద్య ఖర్చుల నిమిత్తం విరాళాలు అందించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా వైద్య చికిత్స కోసం సామాజిక మాధ్యమం ద్వారా దాతల నుండి విరాళాలు సేకరించిన గుమ్ముల శ్రీనివాస్, తెలంగాణ జావీద్, కనుకుట్ల శ్రీనివాస్‌కు ధన్యవాదలు తెలిపారు. సామాజిక కార్యక్రమంలో ముందున్న యువతకు స్థానిక ప్రజా ప్రతినిధులు అభినందనలు తెలియజేశారు. ఇలాంటి సామాజిక కార్యక్రమాల్లో పాల్గొని తమవంతుగా సహకారాలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అన్సర్ హుస్సేన్, పెద్ద సిద్ధాపూర్ సర్పంచ్ పార్తేటి రవి, ఉప సర్పంచ్ అడ్డూరి రాజేష్, స్థానిక యువకులు తొర్రెం జలపతి, దుర్గం రవి, ఇగురపు వెంకటేశ్ పాల్గొన్నారు.